ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం ఉష్ణోగ్రత ఖమ్మం: గరిష్ఠం 31 । కనిష్ఠం 18 భద్రాద్రి: గరిష్ఠం 32 । కనిష్ఠం 20 మంగళవారం, 30 జనవరి 2024 5




4th ANNIVERSARY
4వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
"కాకతీయ కిడ్నీ & డయాలసిస్ హాస్పిటల్" నేడు 4 వ వార్షికోత్సవ శుభవేళ ప్రతి ఒక్కరికి హార్దిక వార్షికోత్సవ కృతజ్ఞతాభివందనములు
"Where Care is Beyond Cure"
శ్రీ కాకతీయ కిడ్నీ & డయాలసిస్ హాస్పిటల్
వైరారోడ్ ఆర్.సి.యం. చర్చ్ ఎదురుగా, అంకుర హాస్పిటల్ రోడ్,
✆ : 9666533362, 9490255657
ఖమ్మంలో మొట్టమొదటిసారిగా ఫుల్‌టైమ్ నెఫ్రాలజిస్ట్ ఆధ్వర్యంలో... కిడ్నీ & డయాలసిస్ హాస్పిటల్
24/7 Emergency Services
కిడ్నీని బ్రతికించుకుందాం... ఆరోగ్యంగా జీవిద్దాం... Life is Beautiful
డా॥ మనోజ్ యాలముడి MD., DM, Nephrology
అన్నిరకాల కిడ్నీ సమస్యల పరిష్కారానికి సరియైన చిరునామా
24/7 నెఫ్రాలజిస్ట్ సేవలు గల హాస్పిటల్
SHIVA SAI ADS/9052040909

భద్రగిరికి పాలకులేరీ?

- స్వరాష్ట్రంలో కొలువుదీరని దేవస్థానం పాలకమండలి
- నవమి నాటికైనా ఏర్పాటు చేయాలంటున్న ఆశావహులు

భద్రాచలం, జనవరి 29: దశాబ్దకాలంగా స్వరాష్ట్రంలో భద్రాద్రి దేవస్థానం పాలక మండలి ఏర్పాటు కల సాకారం కాలేదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం రెండు దఫాలు బీఆర్ఎస్ అధికారం చేపట్టినా భద్రాద్రి దేవస్థానం పాలకమండలి ఏర్పాటుపై కనీస కసరత్తు కూడా చేపట్ట లేదు. ఫలితంగా దక్షిణ అయోధ్య పాలకమండలి లేకుం డానే కొనసాగుతోంది. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చివరిసారిగా 2010లో నియమించారు. రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం ఎందరో ఆశావాహులు భద్రాద్రి పాలక మండలి చైర్మన్ కోసం విశ్వప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పలువురి పేర్లు తెరపైకి వచ్చినా ఆచరణలో మాత్రం పాలకమండలి రూపుదిద్దుకోకపోవడం గమనార్హం. అదిగో ఇదిగో అంటూ అప్పుడప్పుడు పాలక మండలిపై సామాజిక మాధ్యమాలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారం జరుగుతోంది తప్ప వాస్తవంగా కార్యరూపం దాల్చింది లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో మరోసారి ఆశావాహులు భద్రాద్రి దేవస్థానం పాలక మండలి ఏర్పాటుపై ఆశలు పెంచుకుంటున్నారు.



2010 నవంబరు 26న పాలక మండలి ప్రమాణ స్వీకారం

చివరిసారి 14 ఏళ్ల క్రితం..

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పాలకమండలి చివరిసారిగా 14 ఏళ్లక్రితం కొలువుదీరింది. 2010నవంబరు 26న నాడు దేవస్థానం పాలక మండలి చైర్మన్‌గా భద్రాచలానికి చెందిన కురిచేటి పాండురంగారావు బాధ్యతలు స్వీకరించారు. 2012 నవంబరు 25న పాలక మండలి గడువు ముగిసింది. అనంతరం 2014 జూన్ 2న ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ విడిపోయింది. నాటి నుంచి నేటి వరకు స్వరాష్ట్రంలో భద్రాద్రి దేవస్థానానికి పాలక మండలి నియామకం ఆచరణకు నోచకోలేదు. గత దశాబ్ద కాలంలో అప్పటి అధికార పార్టీకి చెందిన కీలక నాయకులు, సానుభూపతిరులు, ఆధ్యాత్మికవాదుల పేర్లు పలుమార్లు తెరపైకి వచ్చినా కేసీఆర్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదనే విమర్శలు వినిపించాయి.

ఇప్పటి వరకు 13పాలక మండళ్లు

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని 17వ శతాబ్దంలో భక్తరామదాసు నిర్మించారు. 1960లో భద్రాద్రి రామాలయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని దేవాదాయశాఖ పరిధిలోకి వెళ్లింది. దాంతో అప్పటిరాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కల్లూరి చంద్రమౌళి చైర్మన్‌గా భద్రాద్రి రామాలయ అభివృద్ధి కమిటీ రూపుదిద్దుకుంది. అనంతరం భద్రాద్రి దేవస్థానానికి పాలకమండళ్లనునియమించడం సంప్రదాయంగా మారింది. ఈ క్రమంలో ఇప్పటి వరకు 13పాలక మండళ్లు కొలువుదీరాయి. తొలినాళ్లలో మూడేళ్లపాటు పాలకమండలి పదవీ కాలం ఉండగా అనంతరం ఏడాది కాలం పాటు తరువాత మళ్లీ రెండేళ్లపాటు పదవీ కాలాన్ని నిర్ణయించారు. దేవస్థానం పాలక మండలికి తొలి చైర్మన్‌గా కల్లూరి చంద్రమౌళి వ్యవహరించారు. కాగా అల్లూరి మూర్తిరాజు పాలక మండలి చైర్మన్‌గా రెండుసార్లు బాధ్యతలు నిర్వహించారు.

ఇప్పటి వరకు పనిచేసిన చైర్మన్లు వీరే..

కల్లూరి చంద్రమౌళి, బండి శోభనాచలం, ఎన్. యతిరాజారావు, అల్లూరి మూర్తిరాజు, ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్, అల్లూరి మూర్తిరాజు, కోనేరు నాగేశ్వరరావు, బోళ్ల వెంకటేశ్వర్లు, కత్తుల శాంతయ్య, కొండబాల కోటేశ్వరరావు, తాళ్లూరి వెంకటేశ్వరరావు, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, కురిచేటి పాండురంగారావు ఉన్నారు.



నవమి నాటికి కొలువుదీరేనా ?

ఈ ఏడాది శ్రీరామనవమి ఏప్రిల్ 17న నిర్వహించనుండటంతో ఆ సమయం నాటికైనా నూతన పాలక మండలి కొలువుదీరుతుందా అని ఆశావాహులు ఆశగా ఎదురుచూస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం నామినేటెడ్ పోస్టులను జనవరి నాటికి పూర్తి చేస్తామని ప్రకటించిన క్రమంలో పాలక మండలిలో చోటు కోసం ఆశావాహులు ఇప్పటికే ప్రయత్నాలను చేపట్టారు. అయితే ప్రభుత్వం ఎప్పటిలోగా పాలక మండలిని ఏర్పాటు చేస్తుందనేది వేచి చూడాల్సిందే. ఇదిలా ఉండగా గత గత రెండు దశాబ్దాలకు పైగా దేవాదాయశాఖలోని దేవస్థానాలకు పాలకమండళ్లు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారాయనే విమర్శ రామభక్తుల నుంచి వినిపిస్తోంది. భక్తితో వ్యవహరించడంతో పాటు రామాలయ అభివృద్ధికి అంకితభావంతో పని చేసే ఔత్సాహికులను నియమించాల్సిన అవసరం ఉందని భక్తులు సూచిస్తున్నారు.

ఓటు సవరణలు పకడ్బందీగా నిర్వహించాలి

ఓటరు జాబితా పరిశీలకురాలు బాల మాయాదేవి

కొత్తగూడెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఓటరు జాబితా పరిశీలకురాలు బాలమాయాదేవి తెలిపారు. ఐడీవోసీ సమావేశ మందిరంలో సోమవారం రిటర్నింగ్ అధికారుల, సహాయ రిటర్నింగ్ అధికారులతో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెలలో ప్రకటించిన ఓటరు జాబితా ముసాయిదా ప్రకారం జిల్లాలోని 1,095 పోలింగ్ కేంద్రాల పరిధిలో 9,72,858 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 6నుంచి 22వ తేదీ వరకు ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించినట్లు తెలిపారు. అలాగే 20, 21 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక క్యాంపుల్లో ఫారం 6-1149, ఫారం 7-382, ఫారం 8-860 దరఖాస్తులు వచ్చాయని, జిల్లా మొత్తంగా 6, 7, 8 ఫారంలను కలిపి 59,658 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిలో 47,612 దరఖాస్తులు విచారణ పూర్తి కాగా, 4,454 దరఖాస్తులు తిరస్కరించారని, 7,589 దరఖాస్తులు విచారణ దశలో ఉన్నట్లు తెలిపారు. వచ్చేనెల 6న డేటా ప్రక్రియ చేసి 8న తుది ఓటరు జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగానికి సంబంధించి తుది ఓటరు జాబితా రూపకల్పన చేయనున్నట్లు వివరించారు. ఓటరు జాబితా రూపకల్పనపై నియోజక వర్గాల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతివారం సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే 18-19 సంవత్సరాల వయసున్న ఓటర్లు 27,490మంది, 80సంవత్సరాలు పైబడిన ఓటర్లు 13,106 మంది ఉన్నట్లు తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని 8 హబిటేషన్లలో ఉన్న అర్హులైన కొండరెడ్లు 692 మంది ఓటు హక్కుకై నమోదు చేసినట్లు తెలిపారు. 1950 కంట్రోల్ రూంకు, ఎన్‌జీఆర్ఎస్ పోర్టల్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదుపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముసాయిదా జాబితాలో ఓటు హక్కును పరిశీలించుకోవాలని, ఏదేని పొరపాట్లు ఉంటే నిర్దేశిత ప్రోఫార్మాలో దరఖాస్తులు చేయాలన్నారు. ఓటర్లు పరిశీలన చేయకుండా చివరి వరకు వేచి ఉండి ఓటుహక్కు లేదనే ఫిర్యాదులు రావొద్దని సూచించారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించిన తీరును అభినందించారు. ఆదే స్ఫూర్తితో రానున్న ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల మాట్లాడుతూ మరణించిన ఓటర్లను జాబితా నుంచి తొలగింపునకు ఫారం-7 జారీ చేస్తున్నామన్నారు. నోటీసులు జారీ చేసిన 7 రోజుల తరువాత తొలగింపు చర్యలుంటాయన్నారు.. మరణించిన వ్యక్తుల డెత్‌సర్టిఫికెట్ ఆధారంగా లేదా, మరణ ధ్రువీకరణ అందుబాటులో లేని సందర్భంలో కుటుంబసభ్యుల వాంగ్మూలాన్ని పరిగణలోనికి తీసుకుని తొలగిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ రాంబాబు, కొత్తగూడెం, భద్రాచలం, ఆర్డీవోలు శిరీష, మంగిలాల్, ప్రత్యేక ఉప కలెక్టర్ కాశయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఓటరు జాబితా పరిశీలకురాలు బాలమాయా దేవి

ఉప ఉత్పత్తులతో రైతుల ఆదాయం పెంచాలి

- పామాయిల్ సాగుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి
- అప్పారావుపేట ఫ్యాక్టరీ విస్తరణ త్వరగా పూర్తి చేయాలి
- పామాయిల్ ముడిసరుకుతో విద్యుత్ తయారీ
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- అప్పారావుపేట, అశ్వారావుపేట ఫ్యాక్టరీల సందర్శన

అశ్వారావుపేట/దమ్మపేట, జనవరి 29: పామాయిల్ ఉప ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయిల్‌ఫెడ్ అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. భద్రాద్రి జిల్లా అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో 90టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్న పాయిల్ కర్మాగారాన్ని, రూ.40కోట్లతో నిర్మించిన డీమక్ పౌడర్ ప్లాంటును, పావర్ ప్లాంట్ బాయిలర్ నిర్మాణ పనులను సోమవారం మంత్రి తుమ్మల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న పామాయిల్ సాగుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి పెట్టారని తెలిపారు. ప్రస్తుతం పామాయిల్ ధర రైతులకు గిట్టుబాటు కావటం లేదని, కనీసం రూ.18వేలు ఉండేలా కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. పామాయిల్ సాగుకు తెలంగాణ హబ్‌గా మారాలన్నారు. పామాయిల్ సాగులో అంతర పంటలపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఖమ్మం జిల్లాలో గోద్రేజ్ సంస్థ చేపట్టిన ఫ్యాక్టరీ నిర్మాణం త్వరగా పూర్తి చేయిస్తామన్నారు. సకాలంలో ఈ ఫ్యాక్టరీ ప్రారంభించకుంటే సమీక్షించి చర్యలు తీసుకుంటామన్నారు. పామాయిల్ విత్తనాలను ఇక్కడే తయారు చేసేందుకు సీఎం దావోస్ సమ్మిట్‌లో ఎంవోయూ చేశారని తెలిపారు. అదికూడా ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తుమ్మల పేర్కొన్నారు. అప్పారావుపేటలో నిర్మించిన అధునాతన కర్మాగారం వల్లనే తెలంగాణాతో పాటు ఇతర రాష్ట్రాలు కూడా ఇదే ఓఈఆర్ ప్రాతిప్రతికదన రైతులకు ధర చెల్లిస్తున్నారని తెలిపారు. రైతులకు మేలు జరిగేలా ఆయిల్‌ఫెడ్ చర్యలు తీసుకోవాలని తుమ్మల తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ అధికారులు సీనియర్ మేనేజర్ సుధాకరరెడ్డి, డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ, అప్పారావుపేట ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్, పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్, ఎంపీపీ సోయం ప్రసాదు, కొయ్యల అచ్యుతరావు, కేవీ సత్యనారాయణ, మన్నెం అప్పారావు, కక్కిరాల రమేష్, అత్తులూరి వెంకటరామారావు, దొడ్డా సత్యం, కోటగిరి బుజ్జిబాబు, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, గుత్తా రాజా, పోతినేని శ్రీరామ వెంకట్రావు, తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో నాగేశ్వరావు ఆయిల్‌ఫెడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సొంత విద్యుత్‌తో ఫ్యాక్టరీ నిర్వహణ

భవిష్యత్‌లో అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని పామాయిల్ ముడిసరుకుతో తయారు చేసుకున్న విద్యుత్‌తో పనిచేయనుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఉదయం ఆయన అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని ఆయిల్‌ఫెడ్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఫ్యాక్టరీలో ఉపయోగించే ఆధునిక సాంకేతిక విధానాలు, సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఫ్యాక్టరీ నిర్వహణకు విద్యుత్ కోసం ప్రతిఏటా రూ.2.50కోట్లకుపైగా వెచ్చించాల్సి వస్తోందని, ఈ బిల్లుల భారం తగ్గించుకునేందుకు ముడిసరుకుతో స్వయంగా విద్యుత్‌ని ఉత్పత్తి చేసుకొనే యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. మే నెలాఖరుకల్లా ఈ ప్రాజెక్టును పూర్తి చేసేలా అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ప్రస్తుతం 30టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్న కొత్త ఫ్యాక్టరీని భవిష్యత్‌లో మరో 30టన్నుల సామర్థ్యం పెంచుకునేలా ప్రణాళికలు చేసినట్టు తెలిపారు. అశ్వారావుపేట ప్రాంతంలో వ్యవసాయ కళాశాల, పరిశోధన కేంద్రాల ఏర్పాటుతో పాటు కొబ్బరి, పామాయిల్, కూరగాయల వంటి ఉద్యాన పంటలతో పాటు వాటిలో కోకో, వక్క, మిరియాలు, జాజి వంటి అంతర పంటలను పండిస్తూ హార్టికల్చర్ హబ్‌గా మారిందన్నారు. త్వరలో ఈ ప్రాంతంలో వీసీ పర్యటిస్తారని, వ్యవసాయ కళాశాలకు అనుబంధంగా హార్టికల్చర్ సబ్జెక్ట్ వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఒకే వ్యవసాయ క్షేత్రంలో ఒకే దఫా రెండు మూడు రకాల పంటలను పండించడం ద్వారా అధిక లాభాలను పొందే దిశగా ఇక్కడి రతులు అడుగులు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ డివిజన్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఆలపాటి ప్రసాద్, బండి భాస్కర్, జేస్ట సత్యనారాయణ చౌదరి, పార్ధసారధి, నర్రా ప్రసాద్, నార్లపాటి రాములు, కట్రం స్వామి తదితరులు పాల్గొన్నారు.


అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న తుమ్మల

వచ్చేనెలలో జిల్లాకు సీఎం రేవంత్?

ఖమ్మం, జనవరి 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : అటు లోక్‌సభ ఎన్నికల ప్రచారంతోపాటు పలు అభివృద్ధి, శంకుస్థాపన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఫిబ్రవరిలో జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం ఉంది. షెడ్యూల్ వెలువడక ముందు సీఎం జిల్లాకు వస్తే ఎన్నికల ప్రచారసభలతో పాటు సత్తుపల్లి మండలం బుగ్గపాడులో నిర్మితమైన రూ.45కోట్ల మెగాఫుడ్‌పార్కు, అశ్వారావుపేటలో ఆయిల్‌ఫామ్ ప్రాజెక్టు అదనపు యూనిట్ ప్రారంభం, అలాగే కొణిజర్ల మండలంలో గోద్రేజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయబోతున్న ఆయిల్ ఫామ్ విత్తనాభివృద్ధి కేంద్రానికి ఆయన శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. అయితే సోమవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సత్తుపల్లి మండలం బుగ్గపాడు ఫుడ్‌పార్కు పనుల పరిశీలించిన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియాసమావేశంలో మాట్లాడుతూ ఫిబ్రవరిలో సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా మెగా ఫుడ్‌పార్కుతోపాటు ఇతర పనులు ప్రారంభించేందుకు కార్యాచరణ సిద్ధంచేస్తున్నట్టు సూచనప్రాయంగా వెల్లడించారు.

ఫుడ్‌పార్క్‌తో రైతులకు మేలు

- శాస్త్రవేత్తలతో రైతులకు సూచనలు, సలహాలు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి, జనవరి 28: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేందుకు మెగా ఫుడ్‌పార్క్ ఎంతో ఉపయోగపడుతుందని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేతశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లి మండలం బుగ్గపాడు ఫుడ్‌పార్క్‌ను సోమవారం ఆయన సందర్శించి టీఎస్ఐఐసీ అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులను, ప్రాసెసర్లను, రిటైలర్లను ఏకతాటిపైకి తెచ్చి వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు అనుసంధానించే యంత్రాంగాన్ని అందించాలనే లక్ష్యంతో మెగాఫుడ్‌పార్క్‌లో మౌళిక వసతులు కల్పించామన్నారు. రూ.70కోట్లతో ఫుడ్‌పార్క్‌లో వసతులు కల్పించామన్నారు. జీడిపప్పు, తోతాపూరి మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు త్వరలో అందుబాటులోకి వస్తాయన్నారు. కూరగాయాల ప్రాసెసింగ్ కూడా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇకపై రైతులు తక్కువ ధరకు తమ ఉత్పత్తులు అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. ఈ ప్రాంతంలో పండే పంటలు ఫుడ్‌పార్క్‌కు తెస్తే ఇక్కడ కోల్డ్‌స్టోరేజీలో నిల్వ చేసుకోవచ్చున్నారు. తద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న 2,500 రైతువేదికలను సాంకేతికంగా అభివృద్ధి చేసి డిజిటల్ స్ర్కీన్లను ఏర్పాటుచేసి శాస్త్రవేత్తలతో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేలా తీర్చిదిద్దుతామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఈ క్రమంలో కొన్ని కంపెనీలతో ఒప్పందం కూడా జరిగిందన్నారు. పామాయిల్ విత్తనాలు దిగుబడి చేసుకునే అవసరం లేకుండా స్థానికంగానే విత్తన ఉత్పత్తి చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించినందున జిల్లాలో దీన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో మరో పామాయిల్ ఫ్యాక్టరీనిర్మాణం త్వరలో పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ అధికారులతో పాటు సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, జారె ఆదినారాయణ, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ ఏ.పవన్‌కుమార్, డీజడ్ఈ స్మరత్‌చంద్ర, మేనేజర్ సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నోట్లిస్తేనే నోటీసులు!

- 41ఏ సీఆర్‌పీసీ ఇచ్చేందుకు లక్షన్నర డిమాండ్
- తొలుత రూ.50వేలు తీసుకుంటూ పట్టుబడిన ఖమ్మం టుటౌన్ రైటర్
- పోలీసుశాఖలో కలవరం రేపిన ఏసీబీ దాడి

ఖమ్మం క్రైం, జనవరి 29 : ఆయన ఓ పోలీస్‌స్టేషన్ రైటర్.. హెడ్‌కానిస్టేబుల్ హోదా. ఓ కేసు విషయమై 41ఏ సీఆర్‌పీసీ నోటీసులివ్వాలంటే నోట్లివ్వాల్సిందే అని డిమాండ్ చేశాడు. లక్షన్నరకు ఒప్పందం చేసుకుని.. చివరకు రూ.50వేలు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఖమ్మంలో సోమవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలివీ. నగరానికి చెందిన బూర్ల రామారావు ఆయన కుమారులు విజయ్, విష్ణులకు ఆయన కుమార్తెకు మధ్య కొంతకాలంగా ఆర్థికపరమైన వివాదాలు జరుగుతున్నాయి. దీనిపై రామారావు కుమార్తె గతేడాది ఖమ్మం టుటౌన్ పోలీసులకు తన తండ్రి, సోదరులపై ఫిర్యాదు చేసింది. దాంతో ఖమ్మం టుటౌన్ పోలీసులు రామారావుతోపాటు ఆయన కుమారులపై చీటింగ్ కేసు నమోదుచేశారు. ఈ కేసులో బెయిల్‌కోసం రామారావు, అతడి కుమారులు హైకోర్టును ఆశ్రయించగా, 41ఏ సీఆర్‌పీసీ నోటీసు ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీంతో వారు ఖమ్మం టుటౌన్ పోలీసు స్టేషన్‌లోని హెడ్‌కానిస్టేబుల్, రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.కోటేశ్వరరావును కలిశారు. 41ఏ సీఆర్‌పీసీ నోటీసు ఇవ్వాలంటే తనకు రూ.లక్షన్నర లంచం ఇవ్వాలని డిమాండ్ చేసి.. చివరకు రూ.50వేలు ఇవ్వాలని చెప్పడంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఖమ్మంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రి సమీపంలో బాధితుల నుంచి రూ.50వేలు తీసుకుంటుండగా కోటేశ్వరరావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. అయితే టుటౌన్ స్టేషన్‌లోని మిగతా అధికారులకు తెలియకుండానే ఇదంతా జరిగి ఉంటుందా అన్న కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈవిషయమై ఏసీబీ డీఎస్పీ రమేష్ విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో మిగిలిన వారి పాత్రపై విచారణ చేస్తున్నామని, ఈ కేసులో ఎవరి పాత్రయినా ఉన్నట్టు తేలితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు లంచం ఇవ్వాల్సిన పనిలేదని, ఎవరైనా లంచం ఇవ్వాలని అంటే తక్షణమే 1064కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈనెంబరు 24గంటలు అందుబాటులో ఉంటుందని ఫిర్యాదుచేసిన వెంటనేసమీప ప్రాంత అధికారులు సంప్రదిస్తారని తెలిపారు. ఇదిలా ఉంటే ప్రజలకు భరోసాగా ఉండాల్సిన, శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసు ఈ లంచం వ్యవహారం వెలుగులోకి రావడం, రైటర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటం పోలీసు శాఖలో కలవరం రేపుతోంది.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

- వచ్చేనెల 28నుంచి పరీక్షల నిర్వహణ
- జిల్లాలో 19,472 మంది విద్యార్థులకు 36 కేంద్రాల ఏర్పాటు
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ ప్రియాంక అలా

కొత్తగూడెం, ఆంధ్రజ్యోతి జనవరి 29: వచ్చే నెలలో నిర్వహించనున్న ఇంటర్ పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డా.ప్రియాంక అధికారులను ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయంలో సోమవారం ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహణపై విద్యా, రెవెన్యూ, పోలీస్, వైద్య, పంచాయతీ, మున్సిపల్, విద్యుత్, పోస్టల్, ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చేనెల 28 నుంచి మార్చి 3 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. మొదటి సంవత్సరం 10,200 మంది, రెండో సంవత్సరం 9,272 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షలు నిర్వహణకు 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. 16 పోలీసుస్టేషన్లలో ప్రశ్నాపత్రాలు భద్రపరచనున్నట్లు తెలిపారు. 36మంది ఛీఫ్ సూపరింటెండెంట్లు, 36మంది శాఖాపరమైన అధికారులు, 13మంది అదనపు పర్యవేక్షకులు విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3 సిట్టింగ్ స్క్వాడ్స్, 5 కస్టోడియన్స్‌ను నియమించామని తెలిపారు. 550 మంది ఇన్విజిలేటర్లకు విధులు కేటాయించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను ముందుగానే మూసి వేయించాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో అత్యవసర వైద్యకేంద్రం ఏర్పాటుతో పాటు తగినన్ని మందులను, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో అత్యవసర వైద్య సేవలకు వార్డులను సిద్దంగా ఉంచాలన్నారు. పంచాయతీ, మునిసిపల్ అధికారులు పరీక్షా కేంద్రాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. మారుమూల ప్రాంతాల విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి వీలుగా అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని, ఇతర డిపోల నుంచి బస్సులు నడిపేందుకు ఆయా డిపో మేనేజర్లుకు లేఖలు రాయాలని ఆదేశించారు. విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా, ధైర్యంగా పరీక్షలు రాసేందుకు మోటివేషన్ తరగతులు నిర్వహించాలన్నారు. వెనుకంజలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధులు కేటాయించిన సిబ్బందికి డ్యూటీ పాసులు జారీ చేయాలని, పాసులు లేని వ్యక్తులను ఎట్టిపరిస్థితుల్లోనూ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించకూడదని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచన రాణి, డీఆర్‌వో రవీంద్రనాథ్, డీపీవో రమాకాంత్, జిల్లా వైద్య అధికారి శిరీష, డీఈవో వెంకటేశ్వరాచారి, విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డా ప్రియాంక అలా..


సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు..

ఈ కేవైసీ @ 200

» చర్లలో గ్యాస్ డీలర్ల చేతివాటం » లబ్ధిదారుల నుంచి రెండు వందలు వసూలు

» పట్టించుకోని పౌరసరఫరాల శాఖ అధికారులు » నష్టపోతున్న గిరిజనులు



చర్ల, జనవరి 29: గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని చర్ల మండలంలోని కొంత మంది గ్యాస్ డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. గ్యాస్ ఈకేవైసీ చేస్తున్నామని ఒక్కో లబ్ధిదారుడి దగ్గర నుంచి సుమారు రెండు వందలు వసూలు చేస్తున్నారు. కొన్ని రోజులుగా వసూళ్ల పర్వం సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఇలా ఈ కేవైసీ పేరుతో డీలర్లు రూ. 50 వేల నుంచి లక్షకు పైగా నగదు వసూలు చేసినట్ల మండలంలో చర్చ సాగుతోంది. కలెక్టర్ దృష్టి సారించి విచారణ జరిపించి, వసూలు రాజాలపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఈకేవైసీ పేరుతో వసూలు

ప్రతీ గ్యాస్ లబ్ధిదారుడి ఖాతాకు బ్యాంక్ ఖాతాను, ఆధార్ కార్డు, అనుసంధానం చెయ్యాలని ప్రభుత్వం ఆదేశించింది. దీని ద్వారా ప్రభుత్వం నుంచి రాయితీ రావడంతో పాటు, లబ్ధిదారుల వివరాలు చాలా స్పష్టంగా ఉంటాయి. ఈ బాధ్యతలను ప్రభుత్వం సంబంధిత గ్యాస్ డీలర్లకు అప్పగించింది. ప్రభుత్వం ఆదేశించిందే తడువుగా, సంబంధిత చర్ల మండలంలోని కొంత మంది డీలర్లు వసూళ్లపర్వం మొదలు పెట్టారు. అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఒక్కో లబ్ధిదారుడి దగ్గర నుంచి సుమారు రూ. 200 వసూలు చేసినట్లు తెలుస్తోంది. 20 రోజులుగా ఈ తతంగం నడుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారణ చేస్తే బయటకు నిజాలు

చర్ల మండంలో సుమారు 25వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు తెలుస్తోంది. రెండు కంపెనీలకు చెందిన సుమారు 8 మంది గ్యాస్ డీలర్లు మండల వ్యాప్తంగా సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. కాగా వీరిలో కొంత మంది ఈకేవైసీ పేరుతో నగదు వసూలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి కొంత మంది పైపులు, రెగ్యులేటర్లు కొంటేనే కేవైసీ చేస్తామని చెప్పినట్లు తెలుస్తోంది. చాలా మంది నగదు లేక ఈకేవైసీ కూడా చేపించలేదని సమాచారం.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం
శ్రీరాం రాథోడ్, పౌరసరఫరాల అధికారి

ఈకేవైసీ పూర్తిగా ఉచితం, గ్యాస్ డీలర్లు నగదు తీసుకోవడం నేరం. నగదు తీసుకుంటున్న విషయం తమ దృష్టికి రాలేదు. వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ప్రజలెవరూ డబ్బులు ఇవ్వొద్దు.

అవిశ్వాసంపై .. అధికార పార్టీ బెదిరింపులు



» సమావేశానికి రాకుండా అడ్డంకులు సృష్టిస్తారని ఫిర్యాదు

» పూర్తి రక్షణ కోసం కలెక్టర్‌కు, ఎస్పీకి బీఆర్ఎస్ కౌన్సిలర్ల వినతి

ఇల్లెందు, జనవరి 29: 'ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావుపై మేము పెట్టిన అవిశ్వాసంపై ఫిబ్రవరి5న బలపరీక్ష సమావేశం జరగనుంది. ఇందులో పాల్గొనకుండా మాపై, మా కుటుంబసభ్యులపై బెదిరింపులు వస్తున్నాయి. మేము ప్రశాంతంగా అవిశ్వాస సమావేశంలో పాల్గొనేలా పూర్తి రక్షణ కల్పించాలని' ఇల్లెందు మున్సిపాలిటీ చెందిన అవిశ్వాస కౌన్సిలర్లు కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు 14మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదులు పంపారు. అధికార కాంగ్రెస్ పార్టీ నుచి రకరకాల బెదిరింపులు, ఒత్తిళ్ల వస్తున్నాయని, మరో వైపు పోలీసులను ప్రయోగించి పాత కేసులను తిరగదొడుతూ తమను, తమ భర్తలను పోలీస్ స్టేషన్‌కు రా వాలంటూ పదేపదే ఫోన్లు చేసి పిలుస్తున్నారని కౌన్సిలర్లు వాపోయారు. అవిశ్వాసం నోటీస్ ఇచ్చిన తర్వాత ప్రత్యే కంగా శిబిరానికి తరలిన తమపై అనేక రకాలుగా వేధింపులకు గురిచేస్తున్నారని, తమ కుటుం బసభ్యుల వ్యాపారాలపై సంబంధిత శాఖల నుం చి నోటీసులు ఇస్తున్నారని కౌన్సిలర్లు ఆరోపించారు. విశ్వాస పరీక్షలో చైర్మన్ దమ్మాలపాటికి అనుకులంగా ఓటు వేయకపోతే తర్వాత ఇబ్బందులు ప డతారని హెచ్చరికలు వస్తున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిబ్రవరి5న జరగనున్న మున్సిపల్ ప్రత్యేక సమావేశానికి హాజరుకాకుండా అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. విశ్వాస పరీక్ష సందర్భంగా తమ పార్టీ నుంచి విప్ జారీ అయ్యినందున తాము ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ఫిబ్రవరి5న ఇల్లెందు మున్సిపల్ సమావేశం ప్రశాంతంగా జరిగేందుకు, తాము సమా వేశంలో పాల్గొనేందుకు తగిన పోలీస్ రక్షణ కల్పించాలని కలెక్టర్, ఎస్పీలకు 14మంది కౌన్సిలర్లు ఫిర్యా దులు పంపారు.

విద్యారంగం పట్ల పాలకుల నిర్లక్ష్యం: ఎస్ఎఫ్ఐ

కొత్తగూడెం, జనవరి 29: విద్యారంగం పట్ల పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రా వీరభద్రం అన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. లోపలికి అనుమతించాలని నాయకులు, విద్యార్థులు నినాదాలు చేయడంతో పోలీసులకు, విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలకు అందించడంతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపధ్యక్షులు సంద్ర బుపేందర్, బి.అభిమన్యు, కె.సందీప్, జిల్లా సహాయ కార్యదర్శి బి.అభిమిత్ర, నాయకులు యశ్వంత్, రాంచరణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఏడాది పనితీరు.. ఎంతో సంతృప్తినిచ్చింది

» నా జన్మభూమి బిహార్.. కర్మభూమి తెలంగాణ

» రామయ్య సన్నిధిలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నా

» ఆంధ్రజ్యోతితో భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్



భద్రాచలం, జనవరి 29: బాల్యం నుంచి ఐపీఎస్ కావాలనే ఆకాంక్ష ఆయ న సివిల్స్ ఎంపికకు మార్గదర్శకంగా నిలిచింది. ఈ క్రమంలో 2019లో సివిల్స్‌కు ఎంపికై 2020 ఐపీఎస్ హోదాలో వరంగల్ జిల్లా రఘునాథపల్లి ఎస్‌హెచ్‌వో శిక్షణ పొందారు. అనంతరం ఏఎస్పీగా తొలి పోస్టింగ్‌లో అత్యం త సమస్యాత్మక ప్రాంతంగా ఉన్న భద్రాచలంలో పరితోష్ పంకజ్ పని చేస్తూ ఏడాదికాలం పూర్తి చేసుకున్నారు. గత ఏడాది జనవరి 30న ఆయన భద్రాచలం ఏఎస్పీగా తొలి పోస్టింగ్ చేపట్టారు. నేటితో ఆయన బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తవుతోంది. ఈ ఏడాదిలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ఒక వైపు మావోయిస్టు కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, పోలీసు సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఇటీవల ముగిసిన సాధారణ ఎన్నికలను సైతం సమర్థవంతంగా నిర్వహించి ఉన్నతాధికారుల మెప్పు పొందారు.

గత ఏడాది కాలంలో పనితీరు ఇలా: గత ఏడాదిలో 67 మంది మావోయిస్టుల అరెస్టు, నలుగురు లొంగుబా టు. ఇందులో మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులతో పాటు వివిధ హోదాల్లో పని చేసిన వారు ఉన్నారు. 911 జిలిటెన్ స్టిక్స్, 626 ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 441 మీటర్ల కోర్డెక్స్ వైరు పట్టుకున్నారు. ఎనిమిది చోట్ల మావోయిస్టులు అమర్చిన మందుపాతర్లను నిర్వీర్యం చేయడంలో చురుగ్గా వ్యవహరించా రు. 39 కేసుల్లో 3,107 కేజీల గంజాయి పట్టుకున్నారు, 89 మంది అరెస్టు పశువుల అక్రమ తరలింపునకు సంబంధించి 18 కేసులు నమోదు చేశారు. 39 మందిని అరెస్టు చేశారు. 365 పశువులు గోశాలకు తరలించారు. ఆదివాసీ గ్రామాల్లో రెండు మెడికల్ క్యాంపులు, స్పోర్ట్స్ మీట్‌లను నిర్వహించారు.

బిహార్ జన్మభూమి.. తెలంగాణ కర్మభూమి: భద్రాద్రి పోస్టింగ్ అదృష్టంగా భావిస్తున్నాను. జీవితంలో ఎప్పటికి మరిచిపోను. భద్రాద్రి రామయ్య కొలువుదీరిన చోట తొలి పోస్టింగ్ రావడం జీవితంలో ఎంతో ఆనందాన్నిస్తుంది. భద్రాద్రి వాసులు నన్నువారిలో ఒకడిగా చేసుకున్నారు. నా జన్మభూమి బిహార్‌లోని భోజ్‌పూర్ అయినప్పటికీ కర్మభూమి తెలంగాణనే. ఈ ఏడాది సంతృప్తినిచ్చింది. ఇదే స్ఫూర్తితో మున్ముందూ బాధ్యతలు నిర్వహిస్తా.

ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజల బారులు

మధిర, జనవరి 29: రేషన్ కార్డుల ఈకేవైసీకి రెండు రోజులే గడువు ఉంది. దీంతో వేలిముద్రలు సరిపడని, ఆధార్ నెంబర్లు కలవని వారంతా అప్‌డేట్ చేసుకొనేందుకు మీసేవా కేంద్రాల వద్దకు పరుగులు పెడుతున్నారు. ఆధార్‌లో అడ్రస్ మార్పు లాంటి కొన్ని ఐచ్ఛికాలను చితంగానే అప్‌డేట్ చేసుకొనే అవకాశం ఉన్నా అందుకు అందరికీ అవగాహన లేకపోవడంతో కంప్యూటర్ సెంటర్లు, మీసేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఈనెల 31 వరకే ఈకేవైసీ చేసే గడువు ఉంది. ఆతర్వాత కేవైసీ చేయని కార్డులకు రేషన్ బియ్యం బంద్ చేస్తారని రేషన్ షాపుల్లో చెప్పడంతో ఈకేవైసీ చేసుకొనేందుకు చాలా మంది మీసేవా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు సోమవారం మధిరలోని మీసేవా కేంద్రం వద్ద బారీగా జనం రేషన్‌కార్డుల అప్‌డేషన్ చేయించుకొనేందుకు బారులు తీరి నిల్చున్నారు ఇదే అప్‌డేషన్ ప్రైవేట్ కంప్యూటర్ సెంటర్లలో కూడా చేస్తున్నారు. ప్రైవేట్‌లో అయితే రూ. 300 వసూలు చేస్తున్నారని ప్రభుత్వం మీసేవా కేంద్రాల వద్ద ఉచితంగా చేయాల్సి ఉన్నా వీరుకూడా ఫీజు వసూలు చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. అయితే ఇంకా రెండురోజులు మాత్రమే సమయం ఉండటంతో డబ్బులు ఇచ్చి పనిచేయించుకొనేందుకు కూడా కార్డు దారులు వెనకాడటం లేదు.ఈకేవైసీ గడువును మరికొంత సమయం పొడిగించాలని, అప్పటివరకు రేషన్ బియ్యం కొనసాగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


మధిరలో మీసేవా కేంద్రం వద్ద బారులు తీరిన తెల్లరేషన్ కార్డుదారులు

నేటికల్లా మిల్లర్లు సీఎంఆర్ అందివ్వాలి: కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 29: కస్టమ్ మిల్లింగ్ రైస్ డెలివరీని నిర్దేశించిన లక్ష్యం మేరకు మంగళవారం సాయంత్రం లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మిల్లర్లను ఆదేశించారు. నూతన కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులు, మిల్లర్లతో సీఎంఆర్ రైస్ డెలివరీ పురోగతిపై సోమవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఈ నెల 31 లోగా ఖరీఫ్ సీఎంఆర్ రైస్ డెలివరీకి చివరి గడువుగా ఇచ్చినట్లు తెలిపారు. పెండింగ్ సీఎంఆర్ రైస్ ఉన్న మి ల్లుల వారిగా కలెక్టర్ సమీక్షించారు. గడువు పొడిగింపు ప్రసక్తే ఉండదని, బుధవారం వరకు సమయమున్న, పెండింగ్ ఉన్న మిల్లులన్నీ మంగళవారం లోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. రైస్ మిల్లులు పూర్తి సామర్థ్యం మేర నిర్వహించి, రైస్ ఉత్పత్తిలో వేగం పెంచి లక్ష్యం మేరకు సి.ఎం.ఆర్. రైస్ డెలివరీ చేయాలనీ ఆయన ఆదేశించారు.. జిల్లా వ్యాప్తంగా 35 రైస్ మిల్లుల నుండి ఇంకనూ 2245.032 మెట్రిక్ టన్నుల(77 ఏసికెలు) సిఎంఆర్ రైస్ డెలివరీ చేయాల్సి ఉందని ఆయన తెలిపారు. ఎఫ్‌సీఐ గోదాముల బియ్యం స్వీకరణకు కూలీలను అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. రైస్ అన్లోడ్, టోకెన్, పేపర్ వర్క్ పూర్తిచేయాలని, ఎక్కడ అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర రావు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

'అంతరాలు లేని విద్యనందించడమే ప్రభుత్వ బాధ్యత'

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 29: అంతరాలు లేని విద్య ప్రజల హక్కు. అలాంటి విద్యను అందరికీ అందేలా చూడటమే ప్రభుత్వ బాధ్యత అని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులను చైతన్యవంతులను చేసేందుకు ఫిబ్రవరి 11, 12 తేదీలలో ఖమ్మంలో సంఘం రాష్ట్ర ద్వితీయ మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కులానికో గురుకులం స్థాపించి ప్రభుత్వ విద్యను విభజించారని, ఫలితంగా విద్యార్థుల్లో అంతరాలు పెరిగిపోయాయని అన్నారు. ఉపాధ్యాయుడు చైతన్య పొందినప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. సమాజ మార్పుల కనుగుణంగా ఉపాధ్యాయులు బోధించాలని తెలిపారు. ఆహ్వాన సంఘం జహాధ్యక్షుల మనోహర్‌రాజు, సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి పి నాగిరెడ్డి, విద్యా పరిరక్షణ కమిటి గౌరవ అధ్యక్షుడు ఆళ్ల రామారావు, జిల్లా ప్రదాన కార్యదర్శి విజయ్ మాట్లాడారు.

గుండెపోటుతో రిటైర్డ్ తహసీల్దార్ మృతి


కృష్ణంరాజు(ఫైల్)

తల్లాడ, జనవరి 29: తల్లాడ మండలం బస్వాపురం గ్రామంలో రిటైర్డ్ తహసీల్దార్ శ్రీనాథరాజు కృష్ణంరాజు(70)గుండెపోటుతో సోమవా రం మృతిచెందారు. కృష్ణంరాజుకు భార్య, ముగ్గురు కుమారులున్నారు. కృష్ణంరాజు మృతి పట్ల మాజీమంత్రి జలగం ప్రసాదరావు సంతాపం తెలిపారు. కృష్ణంరాజు మృత దేహాన్ని కాంగ్రెస్ నాయకులు ఐలూరి వెంకటకోటారెడ్డి(బాబు), తోటకూర శేషగిరిరావు, అన్నెం కోటిరెడ్డి, పోతురాజు కోటయ్య తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రామాలయంలో అర్ధ మండప రజత వాకిలి పనులు షురూ

భద్రాచలం, జనవరి 29: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ప్రధాన ఆలయంలో అర్థ మండప(ముఖ మండపం) రజత వాకిలి ఏర్పాటు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. వంద కేజీల రజతంతో ఇందుకు సంబంధించిన పనులు చేపడుతుండగా ఇందులో సుమారు 70 కిలోలు దేవస్థానం వెండి వినియోగిస్తున్నారు. మిగిలిన 30 కిలోలు దాతల ఆర్థిక సహకారంతో వినియోగి స్తున్నారు. వాస్తవానికి ఇందుకు సంబంధించిన పనులకు 2022 మే 26న పనులు ప్రారంభమయ్యాయి. ఆ సమయంలో ముఖ మండపం, ఆలయ ద్వారానికి ఇరువైపులా ఉన్న ద్వార పాలకులు జయ విజయల నమూనాలను సిబ్బంది సేకరించారు. ఇందుకు సంబంధించి సిబ్బంది వల్లినాయగం నేతృత్వంలో పనులు ఆరంభంలో పలు సూచనలు చేశారు. ఈ క్రమంలో ఇందుకు సంబంధించి రజత వాకిలికి సంబంధించిన విడి భాగాలను రామాలయానికి తీసుకు వచ్చి వాటిని తూకం వేశా రు. అనంతరం వాటిని ఆలయంలో అమర్చే పనులు చేపడుతున్నారు. ఇందు కు సంబంధించిన పనులు ఈ వా రంలోపు పూర్తయ్యే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే అం తరాలయంలో ప్రధాన ద్వారానికి రూ.40 లక్షలతో స్వర్ణ వాకిలిని బీసీసీఐ మాజీ అధ్య క్షుడు శ్రీనివాసన్ తయారు చేయించారు. రజత వాకి లి పనులు సైతం త్వరలో పూర్తి కానుండటంతో రామాలయానికి మరింత శోభ చేకూరుతోంది.


రజత వాకిలి విడి భాగాలను తూకం వేస్తున్న దృశ్యం

రహదారులు రక్తసిక్తం

భద్రాద్రి జిల్లాలో వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు .. ఇద్దరు యువకులు, ఓ మహిళ దుర్మరణం


ప్రమాదంలో మృతి చెందిన విష్ణు

ములకపల్లి/ దమ్మపేట, జనవరి 29 : భద్రాద్రి జిల్లాలో రోడ్లు రక్తసిక్తమయ్యాయి. సోమవారం దమ్మపేట, ములకల పల్లి మండలాల పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు, ఓ మహిళ దుర్మరణం చెందారు. ఇందుకు సంబంధించి ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.


మృతి చెందిన పద్దం వంశీ

వేడుకలు ముగించుకుని వెళ్తుండగా..

ములకలపల్లి మండలం పూసుగూడెం పంచాయతీ పరిధిలోని ఒడ్డురామవరానికి చెందిన పద్దం వంశీ (22), పద్దం విష్ణు (24) వరుసకు ఇద్దరు సోదరులు. వారిద్దరు కలిసి ద్విచక్రవాహనంపై రాజాపురం, ముత్యాలంపాడు గ్రామాలలో ఆదివారం రాత్రి జరిగిన వేడుకలకు హాజరయ్యారు. వేడుకలు ముగించుకొని సోమవారం తెల్లవారుజామున పూసుగూడెం వెళ్లేందుకు బయలు దేరారు. ఈ క్రమంలో కంపగూడెం సమీపంలో మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదాన్ని స్థానికులు గుర్తించేలోపే ఇద్దరికి తీవ్రంగా రక్తస్రావం కావటంతో అక్కడికక్కడే మృతి చెందారు. వేగంగా వెళ్తూ అదుపు తప్పి పడి మృతి చెందారా? ఏదైనా వాహనం ఢీకొట్టి మృతి చెందారా? అనేవి అంతుపట్టకుండా ఉన్నా యి. బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై రాజమౌళి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.


ధ్వంసమైన బైక్

లారీ ఢీకొని మహిళ..

లారీ ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందింది. ఈఘటన గణేష్‌పాడు క్రాస్‌రోడ్ వద్ద సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వెంకట్రాదిగూడేనికి చెందిన గంజి కరుణ (30) తనభర్త కాళిదాసు, కుమార్తెతో కలిసి మందలపల్లి నుంచి వెంకటాద్రి గూడెం వెళుతున్నది. ఈ క్రమంలో గణేష్‌పాడు క్రాస్ రోడ్ సమీపంలో ప్రధాన రహదారిపై సత్తుపల్లి వెళుతున్న లారీ అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది ఈఘటనలో కరుణ రోడ్డుపై పడిపోగా ఆమె పై నుంచి లారీ వెళ్లడంతో ఆమె శరీరం నుజ్జు నుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందింది. కాళిదాసు, కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని దమ్మపేట వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు విచారణ జరుపుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి


సాధిక(ఫైల్)

దుమ్ముగూడెం, జనవరి 29: మండల పరిధిలోని భీమవరానికి చెందిన విద్యార్థిని మచ్చా సాధిక(20) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన నేపథ్యంలో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. సాధిక టీటీసీ పూర్తిచేసి ప్రస్తుతం భద్రాచలం వైటీసీలో కంప్యూటర్ కోర్సు చేస్తూ అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. సాధిక ఈనెల 25 తన స్వగ్రామం భీమవరం వ చ్చింది. వచ్చిన నాటి నుంచి కుటుంబసభ్యులు ఎవరితోనూ మాట్లాడకుండా ముభావంగా ఉంటోంది. ఈనెల 28న కుటుంబ సభ్యులతో కలిసి పత్తి తీసేందుకు పొలానికి వెళ్లింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో నేను ఇంకా పనిచేయలేనంటూ సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ వెళ్లిపోయింది. పొలం నుంచి ఇంటికి వెళ్లిన కుటుంబసభ్యులకు సాధిక డబుల్‌కాట్ మం చం పక్కన కింద పడి ఉండటాన్ని గమనించారు. సాధిక స్పృహతప్పి ఉండగా, ఆమె నోటి నుంచి పురుగులమందు వాసన వచ్చింది. వైద్యం కోసం భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందింది. తన కూతురు మృతిపై అనుమానం ఉందని, దీనికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతురాలి తండ్రి పుల్లయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ గణేష్ దర్యాప్తు చేస్తున్నారు. సాధిక మృతితో భీమ వరంలో విషాదచాయలు అలుముకున్నాయి. ప్రేమ పేరిట చర్ల మండలం కుర్నపల్లికి చెందిన ఓ యువకుడి వేధింపులు, బ్లాక్ మెయిల్ కారణంగా సాధిక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. డబ్బుల కోసం వేధించినట్లు వాట్సప్ చాటింగ్‌లో బయటపడినట్లు సమాచారం.

47 కిలోల గంజాయి పట్టివేత

చుంచుపల్లి, జనవరి 29: ఇరు జిల్లాల్లో సోమవారం ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా పలు ప్రాంతాల్లో అక్రమంగా రవాణా చేస్తున్న 47 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధగా ఉన్న 21.5 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జయశ్రీ సోమవారం తెలిపారు. జిల్లా అబ్కారీ అధికారి జానయ్య, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరం చంద్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జయశ్రీ ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. మరుగుదొడ్ల ప్రాంతంలో అనుమానాస్పదంగా ఉన్న ఒక బస్తాను గుర్తించారు. ఆ బస్తాలో ఎండు గంజాయి ఉన్నట్లు నిర్ధారించి కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. నిందితుల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జీళ్లచెరువు వద్ద.. నేలకొండపల్లి, జనవరి 29: కూసుమంచి మండల పరిధిలోని జీళ్ళచెరువు వద్ద సోమవారం మధ్యాహ్నం ఎక్సైజ్ పోలీసులు 8.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం డీటీఎఫ్, ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో భాగంగా జీళ్లచెరువు వద్ద తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి నుంచి 8.400కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా జింతమణితండాకు చెందిన రాథోడ్ విజయ్‌కుమార్ గంజాయిని హైదరాబాద్ తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఖమ్మంలో.. ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి29: అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని ఖమ్మం రెండో పట్టణ ఎక్సైజ్‌శాఖ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. గంజాయితో పాటుగా ముగ్గురు మహిళా నిందితుల్ని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపారు. మహారాష్ట్రకు చెందిన బేబీ సంతోష్‌సాలంకి, సంగీతపవర్, జయావినోద్‌చౌహాన్‌లు అక్రమంగా గంజాయి తరలించే ముఠాగా ఏర్పాడ్డారు. ఏపీలోని సీలేరులో ఎండు గంజాయిని కొనుగోలు చేసిన హైదరాబాద్‌కు తరలిస్తుండగా సోమవారం ఖమ్మంలో కాపుకాసిన ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకొని తనిఖీలు చేశారు. వారి వద్ద నుంచి 18కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు మహిళలను రిమాండ్‌కు పంపారు.

గర్భిణి, నవజాత శిశువు మృతి కేసులో విచారణ వేగవంతం

చుంచుపల్లి, జనవరి 29: రామవరం ఎంసీహెచ్‌లో గర్భిణి, నవజాత శిశువు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో సోమవారం రాష్ట్ర సెంట్రల్ కమిటీ బృందం దర్యాప్తును వేగవంతం చేసింది. ఇందులో భాగంగా బృందంలో సభ్యులు కొత్తగూడెం వచ్చారు. విచారణలో భాగంగా కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి, రామవరం మాతా-శిశు ఆరోగ్య కేంద్రంలో వివరాలు సేకరించారు. విచారణ అధికారులుగా వచ్చిన వారిలో ప్రొఫెసర్లు ఫోరెన్సిక్ మెడిసిన్ డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ విజయలక్ష్మీ, డాక్టర్ యామిని ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం

తిరుమలాయపాలెం, జనవరి29: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలో జరిగింది. హైదర్‌సాయిపేటకు చెందిన ఎస్‌కే యాకుబ్‌పాషా(28) ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఖమ్మంలోని ఓషాపులో పనిచేస్తున్నాడు. సోమవారం తమ పొలానికి నీరు పెట్టేందుకు వెళుతుండగా ఇదే గ్రామానికి చెందిన నునావత్ వెంకన్న అనే రైతు తమ పంటపొలాలు కోతుల నుంచి రక్షించుకునేందుకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. ఇదిగమనించని యాకుబ్‌పాషా తమ పొలానికి వెళుతుండగా విద్యుదాఘాతానికి గుర య్యాడు. దీంతో అతన్ని 108ద్వారా తిరుమలాయపాలెం ఆసుపత్రికి తరలిం చగా అప్పటికే అతను మృతిచెదినట్టు వైద్యులు గుర్తించారు. కాగా పోస్టు మార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య, 18 నెలల కుమారుడున్నారు. యాకుబ్‌పాషా మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడి తండ్రి జానిమియా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కారు ధ్వంసం

కొణిజర్ల, జనవరి 29: కొణిజర్ల సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కారు ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న వారు క్షేమంగా బయటపడ్డారు. ఎస్ఐ శంకర్‌రావు తెలిపిన వివరాలు ప్రకారం వైరా వైపు నుంచి ఖమ్మం వైపు వస్తున్న కారు, ఖమ్మం వైపు నుంచి వైరా వైపు వెళ్తున్న బోలేరో వ్యాన్ రెండు కొణిజర్ల సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు దెబ్బతినగా, బొలిరోవ్యాను రోడ్డు కిందకు వెళ్లిపోయింది. బొలేరోలో సుమారు 10 మంది చేపలు పట్టేందుకు వెళ్త న్నారు. కారులో వారికి, బొలెరోలో ఉన్న వారికి ఎటువంటి గాయలు కాకుండా క్షేమంగా బయటపడ్డారు. అదే సమయంలో అటుగా వెళ్లుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అక్కడ ఆగి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పెనుబల్లి, జనవరి 29: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని మర్లకుంట గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కొయ్యల వెంకటేశ్వరరావు(50) మద్యానికి బానిసై కూలీపనులకు వచ్చిన డబ్బులు ఇంట్లో ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుండటంతో భార్య, కుమారుడు మందలించడంతో గత శనివారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయ త్నానికి ప్రయత్నించాడు. అతడ్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య నాగరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వీఎంబంజర్ పోలీసులు తెలిపారు.

దాడి కేసులో నిందితుల రిమాండ్

ఆళ్లపల్లి, జనవరి 29: మద్యం మత్తులో 24న ముగ్గురు యువకులు కో-ఆపరేటివ్ ఉద్యోగులపై దాడి చేశారు. ఈ ఘటనలో సోమవారం ముగ్గురు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ రతీష్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ 24న ఉమ్మడి మర్కోడులో విధులు నిర్వహించేందుకు వచ్చిన గుండాల కోఆపరేటివ్ ఉద్యోగులు, సిబ్బందితో పాటు మరో యువకుడిపై దాడి చేసిన ఘటనలో కొమరం రామ్, కొమరం లక్ష్మణ్, జోగ సాగర్‌లపై కేసు నమోదవ్వగా, కేసు దర్యాప్తు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచి, రిమాండ్ నిమిత్తం ఇల్లెందు జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.

వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తిపై ఎలుగుబంటి దాడి

చంద్రుగొండ, జనవరి 29: మార్నింగ్ వాకింగ్ వెళ్లిన వ్యక్తిపై ఎలుగుబంటి దాడి చేసింది. ఈ సంఘటన సోమవారం మద్దుకూరులో జరిగింది. మద్దుకూరుకు చెందిన బాధితుడు నల్లమోతు రామారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని మద్దుకూరు ప్రాజెక్టు కట్టపై రామారావు ఉదయం వాకింగ్ చేసేందుకు వెళ్లాడు. కొంత దూరం వెళ్లాక వంగి వ్యాయామం చేస్తున్న సమయంలో పొదల్లో నుంచి ఇక్కసారిగా ఎలుగుబంటి రామారావుపై దాడి చేసింది. ఈ సమయంలో ఆందోళనకు గురైయిన రామారావు కేకలు వేస్తూ గ్రామంలోకి పరుగులు తీశాడు. ఎలుగుబంటి అడవి వైపు వెళ్లింది. ఈ దాడిలో రామారావు తలకు తీవ్ర గాయాలయాయి. కుటుంబ సభ్యులు చికిత్స కోసం విజయవాడ తరలించారు.


కొబ్బరితోటలోని అంతర పంటను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

వేకువజామున

వ్యవసాయ క్షేత్రంలో..

» పొలాల్లో కలియదిరిగిన వ్యవసాయశాఖమంత్రి

» కొబ్బరిలో కోకో, వక్క, జాజి పంటలు సాగుచేస్తున్న తుమ్మల

ఖమ్మం, జనవరి 29 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : రైతుకుటుంబంలో పుట్టి రాజకీయంగా ఎదిగి.. ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్ ప్రభుత్వాల్లో పలుశాఖలకు మంత్రిగా వ్యవహరించారు తుమ్మల నాగేశ్వరరావు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయశాఖమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. చిన్ననాటి నుంచి రాజకీయాలతో పాటు వ్యవసాయంపైనా మక్కువ పెంచుకున్న ఆయన మంత్రిగా రాష్ట్రంలో ఎక్కడ తిరిగినా స్వగ్రామం వెళితే చాలు వేకువజామునే కోడికూత సమయానికే లేచి తన పొలాలకు వెళ్లాల్సిందే. పొగమంచు ఉన్నా, వణికించే చలి ఉన్నా లెక్క చేయకుండా పొలమంతా కలియతిరిగి మొక్కమొక్కను పరిశీలించి అక్కడ పనిచేసే సిబ్బందికి సాగు యాజమాన్యంలో సూచనలు ఇవ్వడం అలవాటు. ఈ క్రమంలోనే సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకే నిద్రలేచిన తుమ్మల అశ్వారావుపేట మండలం గంగారంలోని తన వ్యవసాయక్షేత్రంలో ఉన్న కొబ్బరితోట, అంతరపంటలుగా వేసిన కోకో, వక్క, జాజి తోటలను స్వయంగా పరిశీలించారు. రాష్ట్రంలో అశ్వారావుపేట ప్రాంతంలో సాగవుతున్న కోకోలు చాక్లెట్లు, కేకులు లాంటి ఇతర ఆహార ఉత్పత్తులకు వినియోగిస్తుండగా వక్కను శుభకార్యాలు, పాన్లకు వినియోగిస్తారు. అలాగే జాజిని మసాలా దినుసుల్లో ఇతర సుగంధద్రవ్యాలు, బిర్యానీ లాంటి ఆహార పదార్థాల తయారీలోను వినియోగిస్తారు. రైతులు అరుదుగా పండించే ఈ పంటలను .. మంత్రి తుమ్మల దశలవారీగా తన కొబ్బరి, పామాయిల్ తోటల్లో అంతరపంటలుగా సాగుచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వక్క మొక్కలను ఆధారంగా చేసుకుని మిరియాల పంటను వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్రంలో పత్తి, మిర్చి లాంటి వాణిజ్య పంటలతోపాటు పలురకాల ఆహార, నూనెగింజలు, కూరగాయల సాగు జరుగుతుండగా.. కోకో, వక్క, జాజి లాంటి అరుదైన పంటలను అశ్వారావుపేట ప్రాంతంలో ఇటుమంత్రి తుమ్మలతో పాటు పలువురు రైతులు అంతరపంటలుగా సాగుచేస్తున్నారు. ఈపంటల ఉత్పత్తులను కర్ణాటక, ఏపీ నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. వక్క పంట ఎకరానికి రూ.2లక్షల నుంచి రూ.3లక్షలపైగా ఆదాయం వస్తుందని, కోకో పంట ద్వారా ఎకరానికి రూ.35వేలకు పైగా ఆదాయం వస్తుందని మంత్రి తుమ్మల చెబుతున్నారు.

హార్టికల్చర్ హబ్‌గా అబివృద్ధి
'ఆంధ్రజ్యోతి'తో మంత్రి తుమ్మల

రాష్ట్రంలో అధునాతన పంటలు సాగుకు అశ్వారావుపేట ప్రాంతం ప్రసిద్ధి చెందిందని, అశ్వారావుపేటను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఉదయం భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం గంగారంలోని తన వ్యవసాయక్షేత్రంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఈప్రాంతంలో ఆయిల్‌పాం మొక్కను ఆయన చేతులమీదుగా నాటించామని, తద్వారా ఆయిల్‌పామ్ పంట ఏపీ నుంచి తెలంగాణలో కూడా వ్యాప్తి చెందిందని, అశ్వారావుపేటతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఎకరాల్లో సాగవుతోందన్నారు. అలాగే కొత్తగా కర్ణాటక తదితర ప్రాంతాల్లో పండే వక్క, కోకో, జాజి లాంటి పంటలనుకూడా గడిచిన ఐదేళ్లుగా దశలవారీగా సాగుచేస్తున్నామని ఈ పంటలు ఈ ప్రాంతంలో కొబ్బరితోపాటు ఆయిల్ పామ్ సాగులో అంతరంపంటలుగా వేసుకుని రైతులు అదనపు ఆదాయం పొందే అవకాశం కలుగుతుందని, తాను స్వయంగా ఈ పంటలు సాగుచేస్తున్నానని, భవిష్యత్తులో తెలంగాణలో కోకో, వక్క, జాజి లాంటి పంటలు మరింతగా విస్తరణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల బెంగళూరు నుంచి కొందరు శాస్త్రవేత్తలు వచ్చి ఈ పంటల సాగుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుందని తెలియజేశారని, రైతులు కేవలం ఒకే పంట సాగుతో ప్రకృతి వైపరిత్యాలతో నష్టపోకుండా అంతర పంటల సాగుతో ఏడాదిపొడవునా ఏదోఒక ఆదాయం చూసేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అలాగే తెలంగాణలో చదువుకున్న యువరైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అధునాతన పంటలపై అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టబోతోందని, ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు, ఇరాడియేషన్ యూనిట్లు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి వద్ద ఆయిల్‌పామ్ విత్తనోత్పత్తికి గోద్రేజ్ కంపెనీ ఆధ్వర్యంలో రూ.500కోట్లతో ఏర్పాటుకు ఇటీవల దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా త్వరలోనే గోద్రేజ్ కంపెనీతో ఇక్కడ ఆయిల్‌పామ్ విత్తనాలను ఉత్పత్తిచేసి తద్వారా నర్సరీలను పెంచడం జరుగుతుందన్నారు. ఇప్పుడు మలేషియా, ఇండోనేషియా నుంచి విత్తనప్లాంట్లను దిగుమతి చేసుకుంటున్నామని, దీంతో మొక్కల ధర ఎక్కువపడుతుందని, ఇక్కడే విత్తనాలను ఉత్పత్తి చేసుకుని నర్సరీలనుప్రోత్సహించడం వల్ల తక్కువ రేటుకు మొక్కలు లభిస్తాయన్నారు. రాష్ట్రంలో ఐదుచోట్ల ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ద్వారా ఆయిల్‌ఫ్యాక్టరీలను పూర్తిచేయబోతున్నామని తెలిపారు. అలాగే రైతువేదికల ద్వారా నేరుగా వ్యవసాయ పరిశోధన కేంద్రాలు, శాస్త్రవేత్తలతో యూనివర్సిటీల నుంచే పంటల సాగు, తెగుళ్ల నివారణ, రైతుల సమస్యలకు సమాధానాలు లాంటి కార్యక్రమాలు, అధునాతనపంటలు, దేశ, విదేశాల్లోని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టబోతున్నామని తుమ్మల వివరించారు.


తన వ్యవసాయక్షేత్రంలోని కోకో పంటను పరిశీలిస్తున్న తుమ్మల

తుది దశకు రాజీవ్ ట్రోఫీ

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 29: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాజీవ్‌గాంధీ మెమోరియల్ రాజీవ్ ట్రోఫీ ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు సెమీ ఫైనల్స్ దశకు చేరాయి. టోర్నీలో ఖమ్మం అర్బన్, వీఎం బంజర, సత్తుపల్లి, తల్లాడ జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. పోటీలను కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు జావెద్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతరాములు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లలో ఖమ్మం అర్బన్ జట్టు కొణిజర్ల జట్టుపై, వీఎం బంజర జట్టు కల్లూరు జట్టుపై విజయం సాధించాయి. పోటీలను నిర్వాహకులు మతిన్, వేణు, సూర్యం, రామారావు, వరప్రసాద్, నరేష్, వెంకట్, సలీం తదితరులు సమీక్షించారు.

కుష్టు నివారణే ధ్యేయం

» నేటి నుంచి ఫిబ్రవరి 13 వరకు అవగాహన

» నేడు ప్రపంచ కుష్టు నివారణ దినం

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 29: గాంధీ వర్ధంతి సందర్భంగా ప్రపంచ కుష్టు నివారణ దినోత్సవాన్ని ఏటా నిర్వహిస్తున్నారు. గత ఆగస్టు నుంచి డిసెంబరు వరకు కుష్టు బాధితుల గుర్తింపు ప్రక్రియను నిర్వహించారు. తీవ్ర అనారోగ్యానికి, అంగవైకల్యానికి కారణం అవుతున్న లెప్రసీని నివారించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కసరత్తు చేస్తోంది. కుష్టు రహిత సమాజాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా బాధితులను గుర్తించే ప్రక్రియను వైద్య ఆరోగ్యశాఖ చేపట్టింది. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 1,326 బృందాలతో ఆగస్టు 16 నుంచి 31 వరకు సర్వే నిర్వహించారు. కుష్టు వ్యాధి అంటువ్యాధి, గాలిద్వారా ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. రోగులు దగ్గినా తుమ్మినా నోటి నుంచి వచ్చే తుంపరల ద్వారా మరోకరికి సోకే ఆస్కారం ఉంటుంది.

30 పీహెచ్‌సీల పరిధిలో..

ఖమ్మం జిల్లాలో 26 పీహెచ్‌సీలు, మరో 4యూపీహెచ్‌సీలు ఉన్నాయి. ఆగస్టు 16 నుంచి 31వరకు ఇంటింటి సర్వే నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 1326 బృందాలు సర్వేలో పాల్గొన్నాయి. సర్వేలోనూ ప్రజలకు కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యాధిని ముందస్తుగా గుర్తించి మందులు వాడాలని సూచించారు. జిల్లాలో 3లక్షల 5వేల 56 కుటుంబాల్లో 12లక్షల 75వేల 124 మందికి పరీక్షించారు. వీరిలో 1371 మందికి కుష్టువ్యాధి అనుమానితులను గుర్తించి వారికి స్క్రీనింగ్ చేయగా 49 మంది వ్యాధి గ్రస్తులను గుర్తించారు. వారితో పాటు గతంలో ఉన్న రోగులు మొత్తంగా 69 మందికి జిల్లా వ్యాప్తంగా చికిత్సలను అందిస్తున్నారు. .

జాతీయ కబడ్డీ అంపైర్‌గా నరేష్



జూలూరుపాడు, జనవరి29: రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా బాచుపల్లిలో నిర్వహిస్తున్న 70వ జాతీయ స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన కూరాకుల నరేష్ అంపైర్(టెక్నికల్ ఆఫీసియల్‌గా) నియమితు లైనట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో దేశ నలుమూలల క్రీడాకారులు హాజరవుతున్నట్లు తెలిపారు. జూలూరు పాడు మండలం నుంచి మొదటిసారిగా జాతీయ స్థాయి పోటీలకు అంపైర్‌గా వ్యవహరించే అవకాశం దక్కడం ఆనందంగా ఉందని అన్నారు. ఆయన ఎంపిక పట్ల భద్రాద్రి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కె.స్వాతిముత్యం హర్షం తెలిపారు.

తీర్థాల సంగమేశ్వరాలయంలో

6వ తేదీన వేలంపాట

ఖమ్మం రూరల్, జనవరి 29: మండల పరిధిలోని తీర్థాల సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న జాతరకు సంబంధించిన వేలంపాట ఫిబ్రవరి 6వ తేదీన ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శేషయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కొబ్బరి కాయలు, పూజా సామగ్రి లడ్డు, పులిహోరా, కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనుట మరమరాలు, రంగుల రాట్నం నిర్వహణకు సంబంధించిన వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మరిన్ని వివరాలకు ఆలయంలో సంప్రదించాలని సూచించారు.

విజయలో విబేధాలు

» ప్రభుత్వ డెయిరీ భవిష్యత్‌పై నీలినీడలు

» పరస్పర ఆరోపణలు చేసుకుంటున్న పాడిరైతులు

» డీడీ కుమారస్వామి మాతృసంస్థకు

» నూతన డిప్యూటీ డైరెక్టర్‌గా ధన్‌రాజ్


సమావేశం నిర్వహిస్తున్న నూతన డీడీ ధన్‌రాజ్


హాజరైన పాల సొసైటీ అధ్యక్షులు,పాడిరైతులు

ఖమ్మం కార్పొరేషన్, జనవరి 29: విజయ డెయిరీలో విబేధాలు రచ్చకెక్కుతున్నాయి. పాడిరైతులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ అధికారులకు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు డిప్యూటేషన్‌పై ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కుమారస్వామిని సోమవారం తిరిగి మాతృశాఖ అయిన పశుసంవర్థక శాఖకు పంపుతూ తెలంగాణా పాడిపరిశ్రమాభివృద్ధి శాఖ ఎండీ సీహెచ్ లక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. కాగా విజయ డెయిరీ నూతన డీడీగా జనగాం డెయిరీ డీడీ జి. ధన్‌రాజ్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయటంతో ధన్‌రాజ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ఒకరిపై మరొకరు ఫిర్యాదులు

పాడిరైతుల సొసైటీ అధ్యక్షులు, పాడిరైతులు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ఫిర్యాదులు చేసుకోవటంతో ఇప్పుడిప్పుడే ఒక గాడిన పడుతున్న విజయ డెయిరీ భవిష్యత్‌పై నీలినీడలు అలుముకుంటున్నాయి. ముఖ్యంగా పాలలో వెన్నశాతం తగ్గించి చూపుతున్నారని ప్రధాన ఆరోపణ. కాగా దీనిని కొందరు అధ్యక్షులు, పాడిరైతులు ఖండించి, కలెక్టర్ వద్దకు వెళ్లారు. కాగా పాడిరైతల సమాఖ్య జిల్లా అధ్యక్షుడికి పాలసేకరణ కేంద్రం లేకున్నా, దొంగబిల్లులతో సొమ్ములు స్వాహా చేస్తున్నారని కొందరు కొత్తగా వచ్చిన డీడీకి సోమవారం ఫిర్యాదు చేశారు. ఇలా సొసైటీ అధ్యక్షులు, పాడిరైతులు పరస్పర ఫిర్యాదులు చేసుకోవటంతో ప్రజలకు విజయ డెయిరీపై నమ్మకం పోతుందనే ఆందోళన వ్యక్తం అవుతున్నది. ఇప్పటికే పాల విక్రయాలు తగ్గిన నేపథ్యంలో పాడిరైతుల మధ్య గొడవ వల్ల మరింత నష్టం జరిగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లా పాడిరైతులతో నూతన డీడీ సమావేశం

విజయ డెయిరీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల డీడీగా బాధ్యతలు స్వీకరించిన జి. ధన్‌రాజ్ సోమవారం విజయ డెయిరీ డీడీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల పాల ఉత్పత్తిదారులు, పాడిరైతులు, విజయ పాలశీతలీకరణ యూనిట్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. వారు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పాల ఉత్పత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బోజెడ్ల వెంకటయ్య, ఇమ్మడి శ్రీనివాసరావు, కె. బసవయ్య, ఆర్.రామయ్య, కె. నాగేశ్వరరావు, ధనమ్మ, ఉమారాణి, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భళా రాధిక..

» ఖమ్మం మహిళకు

గోల్డెన్ ఫేస్ ఆఫ్ హైదరాబాద్ కిరీటం


గోల్డెన్ ఫేస్ ఆఫ్ హైదరాబాద్ కిరీటం సాధించిన రాధిక రంగపురి

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 29: ఖమ్మం నగరానికి చెందిన రాధిక రంగపురి గోల్డెన్ ఫేస్ ఆఫ్ హైదరాబాద్ కిరీటం గెలుచుకున్నారు. హిల్టన్ చెన్నైలో ఆదివారం జరిగిన గ్రాండ్ ఫినాలేలో రాధిక ఈ అవార్డు గెలుచుకున్నారు. చైన్నైకి చెందిన విండో ఎంటర్‌టైనమెంట్స్, ఏసీటీసీ స్టుడియో జీ ఎఫ్ ఎస్ ఐ 2024 అందాల పోటీని నిర్వహించింది. యాసిడ్ దాడుల బాధిత మహిళలు, యువతులకు ఆత్మస్థైర్యం నిలిపేలా ఈ పోటీని నిర్వహించారు. యాసిడ్ దాడి బాధితులకు చర్మదానం అవగాహన పెంపొందించే లక్ష్యంగా సంస్థలు పనిచేస్తున్నాయి. గ్రాండ్ ఫినాలేకు నటి అమీ జాక్సన్, నటి శ్రేయాశరణ్, ప్రముఖ దర్శకుడు విండో ఎంటర్‌టైనమెంట్స్ చైర్మన్ ఎఎల్ విజయ్, బ్రాండ్ అంబాసిడర్ పార్వతి నాయర్ హాజరయ్యారు.

సదరం కోసం నిరీక్షణ

» స్లాట్ దొరక్క ఇబ్బందులు

» పట్టించుకోని అధికారులు


సదరం క్యాంపులో వివరాలు నమోదుచేసుకుంటున్న వికలాంగులు(ఫైల్)

అశ్వాపురం, జనవరి 29: వికలాంగులు, దివ్యాంగులు ప్రభుత్వ పథకాల లబ్ధిపొందాలంటే సదరం సర్టిఫికెట్ తప్పనిసరి. వివిధకారణాలతో వికలాంగులుగా మారిన వారు గత మూడు,నాలుగు నెలలుగా సదరం కోసం నిరీక్షిస్తున్నారు. సదరు సర్టిఫికెట్ పొందాలంటే ఖచ్చితంగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉండగా, ఆ బుకింగే వారికి ఇబ్బందిగా మారుతోంది. సదరం క్యాంపు గురించి అధికారులు ప్రకటించగానే ఎంతో ఆశతో మీసేవా కేంద్రాల దగ్గరకు వెళుతున్న దివ్యాంగులకు స్లాట్లు పూర్తయ్యాయనే సమాచారంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. సర్టిఫికెట్ పొందటానికి దివ్యాంగులలు స్వయంగా మీసేవాకేంద్రాలకు వెళ్లి థంబ్ వేసి స్లాట్ బుక్ చేసుకున్న అనంతరం సదరం క్యాంపుకు వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ వైద్యులు పరీక్షించి వైకల్య శాతాన్ని బట్టి సర్టిఫికెట్ మంజూరు చేస్తారు. కాని నెలలతరబడి స్లాట్ బుకింగ్ దొరక్క సంక్షేమపథకాలు దరిచేరక ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటంపై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఈప్రహసనం అంతటికీ కారణం డీఆర్డీఏ అధికారులు జిల్లా అంతటికీ ఒకేసారి 30స్లాట్స్ మాత్రమే కేటాయిస్తుండటంతో ప్రకటన వెలువడిన కొద్ది నిమిషాల్లోనే స్లాట్స్ నిండిపోతున్నాయి.

ఐటీడీఏ పీవో చొరవతో

గిరిజన మహిళకు కంటి వైద్యం

ఫిబ్రవరి 2న శస్త్ర చికిత్సకు వైద్యుల నిర్ణయం


పీవోకు సమస్యను వివరిస్తున్న భద్రమ్మ

భద్రాచలం, జనవరి 29: దుమ్ముగూడెం మండలం సీతానగరం సమీపంలోని నడిగడ్డ గ్రామానికి చెందిన పూనెం భద్రమ్మకు ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ ప్రత్యేక చొరవ తీసుకొని కంటి వైద్యం అందించారు. భద్రాచలంలో సోమవారం గిరిజన దర్బారు నిర్వహిస్తున్న సమయంలో భద్రమ్మ తనకు ఉన్న కంటి సంబందిత సమస్య గురించి వివరించడంతో పీవో ప్రతీక్‌జైన్ ఏరియా వైద్యశాల అధికారులతో తక్షణమే మాట్లాడారు. ఈ క్రమంలో పీవో ఉపయోగించే వాహనంలోనే భద్రమ్మను ఏరియా వైద్యశాలకు అధికారులు తీసుకెళ్లారు. అక్కడ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ పర్యవేక్షణలో డాక్టర్ సంతోష్ భద్రమ్మకు కంటి పరీక్షలు నిర్వహించారు. భద్రమ్మకు వచ్చే నెల 2వ తేదీన కంటి ఆపరేషన్ నిర్వహించనున్నట్లు వైద్యులు తెలిపారు.

గిరిజన దర్బారు నిర్వహించిన పీవో

ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం సందర్భంగా గిరిజన దర్బారులో పీవో ప్రతీక్‌జైన్ ఐటీడీఏ పరిధిలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన గిరిజనుల వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్ ద్వార నమోదు చేసి ప్రతి గిరిజన కుటుంబాలను విడతల వారీగా సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఈఈ గిరిజన సంక్షేమ శాఖ తానాజీ, ఆర్‌సీవోటీ వెంకటేశ్వర రాజు, ఎస్‌వో సురేష్‌బాబు పాల్గొన్నారు.

చెత్త డంపింగ్ అడ్డగింత

నిత్యం వ్యర్థాలు పోస్తున్నారంటూ కాలనీవాసుల ఆందోళన


చెత్త నింపిన మునిసిపల్ ట్రాక్టర్లను అడ్డుకున్న కాలనీవాసులు

సత్తుపల్లిరూరల్, జనవరి29: చెత్తను డంపింగ్ చేస్తున్న సత్తుపల్లి మునిసిపాలిటీ ట్రాక్టర్లను ప్రజలు అడ్డుకున్నారు. నిత్యం పట్టణంలో సేకరించిన చెత్తను తామర చెరువు వద్ద, పాత ఎన్టీఆర్ కాలువలో విచ్చలవిడిగా మునిసిపాలిటీ ట్రాక్టర్ల ద్వారా నింపేస్తున్నారంటూ సోమవారం సమీప ప్రాంత ప్రజలు ఆందోళనకు దిగారు. సత్తుపల్లి మునిసిపాలిటీలోని 23వార్డుల్లో రోజూ సేకరించిన చెత్తను 10కి.మీ. దూరంలోని కొమ్మేపల్లి గ్రామంలో కేటాయించిన యార్డులో డంప్ చేయాల్సి ఉంది. కానీ కొందరు ట్రాక్టర్ల డ్రైవర్లు తామర చెరువు సమీపంలో, పాత ఎన్టీఆర్ కాలువలో, వేంసూరు రోడ్‌లోని మెట్టాంజనేయ స్వామిఆలయం దాటిన తర్వాత చెత్తను డంప్ చేస్తున్నారు. దుర్వాసనతో పాటు చెత్తను కాల్చిన పొగతో శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాత ఎన్టీఆర్ కాలువలో చెత్తను డంప్ చేసేందుకు వచ్చిన ట్రాక్టర్లను అక్కడివారు అడ్డుకున్నారు. తమకు కేవలం 5లీటర్ల డీజిల్ మాత్రమే ఇస్తున్నారని, అందుకే అంతదూరం వెళ్లడం లేదని డ్రైవర్లు అన్నారు. అయితే అధికారులు వచ్చేవరకు ట్రాక్టర్లను కదలనివ్వబోమని కాలనీవాసులు అడ్డుకున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాబూరావు జోక్యం చేసుకుని చెత్తను వేయకుండా చూస్తామని చెప్పడంతో ఆందోళనను విరమించారు.

కాగా ఆదివారం చెత్త నింపిన ట్రాక్టర్లను పాత ఎన్టీఆర్ కాలువ వద్ద డ్రైవర్లు పార్కింగ్ చేశారని, చెత్త పోసేందుకు కాదని మునిసిపల్ కమిషనర్ కె. సుజాత ఏ ట్రాక్టర్ అయినా కొమ్మేపల్లిలోని డంపింగ్ యార్డుకు వేళ్లాల్సిందేని, నిబంధనలు మీరితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాక్టర్‌లకు డీజిల్ సరిపోను ఇస్తున్నామని వివరణ ఇచ్చారు.

గోశాలలకు పశుగ్రాసం ఇచ్చిన మంత్రి తుమ్మల

» కల్లూరు నుంచి ట్రక్కుల్లో తరలింపు


పశుగ్రాసం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతు ప్రతినిధులు

కల్లూరు, జనవరి 29: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలోని పలు గోశాలలకు పశుగ్రాసాన్ని సోమవారం వితరణ చేశారు. ఆ క్రమంలో కల్లూరు పట్టణం నుంచి కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు పలువురు రైతుల నుంచి పశుగ్రాసంను సేకరించారు. అనంతరం ఖమ్మంలోని శ్రీ వెంకటేశ్వర, శ్రీ కృష్ణ గోశాలలకు ట్రాక్టర్ల ద్వారా తరలించి గ్రాసాన్ని అందించారు. మూగజీవులకు గ్రాసాన్ని వితరణ చేసిన మంత్రి తుమ్మలకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మం లోని గోశాలలకు ట్రాక్టర్ల ద్వారా చేరిన పశుగ్రాసాన్ని జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నల్లమల్ల వెంకటేశ్వరరావు జెండా ఊపి స్వాగతం పలుకుతూ గోశాలలకు సదరు గ్రాసాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, రైతు ప్రతినిధులు ఎస్‌కే యాఖుబ్‌అలీ, ఉబ్బన గోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓబీ కంపెనీల్లో స్థానికులకే ఉపాధి కల్పించాలి

» సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య

మణుగూరుటౌన్, జనవరి 29: సింగరేణి కాలరీస్ కంపెనీల్లో స్థానిక యువకులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బి. అయోధ్య డిమాండ్ చేశారు. సోమవారం మణుగూరు సీపీఐ కార్యాలయంలో జరిగిన ఏఐటీయూ మండల జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు గనుల విస్తరణ కోసం గ్రామాల్లో పేద ప్రజలు తమ భూములను, ఆస్తులను, ఇళ్లను త్యాగం చేసి ఉపాధి కోల్పోయారన్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు దృష్టి సారించి స్థానిక యువతకు అవకాశం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున స్థానిక యువతతో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నూతన కమిటీ ఎన్నిక.. ఏఐటీయూసీ మండల జనరల్ బాడీ సమావేశం అనంతరం మండల ఏఐటీయూసీ నూతన కమిటీని అయోధ్య, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ లక్ష్మీనారాయణ సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాయల భిక్షం, కార్యదర్శిగా జి. వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా తోట రమేష్, జక్కుల రాజబాబు, ఉపాధ్యక్షుడిగా ఆదర్ల సురేందర్, సహాయకార్యదర్శిగా సంతోష్, కోశాధికారిగా కొత్తపల్లి సీతారాములులతోపాటు మొత్తం 13మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దర్శాల సుధాకర్, జంగం మోహన్‌రావురావు, మంగి వీరయ్య, రాజు, సంపత్ పాల్గొన్నారు.

WALK - IN - INTERVIEW
ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేయుటకు నిరుద్యోగ యువకులకోసం ఈ క్రింది ఉద్యోగ అవకాశాలు కలవు.
కాబట్టి అర్హత కలవారు ఇంటర్వ్యూలకు హాజరుకాగలరు.
ఆంధ్రజ్యోతి
డివిజన్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ (SR)
అశ్వారావుపేట,మధిర, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం
అభ్యర్థి తన డివిజన్ పరిధిలోని ఏజెంట్లను, సేల్స్ టీమ్స్‌ను కో-ఆర్డినేషన్ చేస్తూ మంచి రిజల్ట్ వచ్చేవిధంగా పని చేయవలసి ఉంటుంది. అభ్యర్థి కనీస అర్హతఇంటర్‌మరియు సేల్స్ రంగంపై ఆసక్తి కలిగి ఉండవలెను. అర్హత, అనుభవాన్ని బట్టి వేతనం నిర్ణయించబడును.
పై అర్హతలు గల అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకాగలరు
ఇంటర్వ్యూ తేది: 01-02-2024 ఉ॥ 10:00 నుండి మ॥ 2 గంటలు వరకు
ఇంటర్వ్యూ స్థలము : సర్క్యులేషన్ మేనేజర్
ఆంధ్రజ్యోతి కార్యాలయం.
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్స్ నెం: 112,
ఇండస్ట్రియల్ ఏరియా ఖానాపురం హావేలి,
శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి గుడి రోడ్డు, ఖమ్మం
సెల్: 9985411350

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

WANTED
ఖమ్మంలోని ప్రముఖ జూనియర్ కాలేజీ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్, టెలికాలర్స్, మార్కెటింగ్ ఏజెంట్స్ (PRO'S) Qly: Any Degree అర్హత, ఫ్లోర్ ఇన్ చార్జెస్, Qly: Any PG / B.Tech / M.Tech కావలెను. సంప్రదించగలరు.
7675097755 7673943999, 995177755
AJM-2814

WANTED
Wanted Driver (InnovaCar)-1, Lady Receptionist(02) Intermediate Qualification @Pulipati Prasad Group of Institutions KHAMMAM@Mobile. 9700754999, 9700892999
AJM-11031

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజ్ -ఏడీవీటి

స్వదేశాగమనము/ విదేశీయానం | పుట్టిన రోజు | వివాహ వార్షికోత్సవం | షష్టిపూర్తి | లీగల్ నోటీసులు | శ్రద్ధాంజలి | పదవీవిరమణ
వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు
ఖమ్మం : 9985401672
4 Lines Classifieds Khammam + B-Kothagudem Dists 220/- Only Extra Line 45/- only
ఖమ్మం 9985406151 9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347

భద్రాద్రి కొత్తగూడెం
ఆంధ్రజ్యోతి ANDHRAJYOTHY
మంగళవారం 30 జనవరి 2024 | 8 | కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా గోపాలరావు



జూలూరుపాడు, జనవరి 29: తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) రాష్ట్ర కార్యదర్శిగా జూలూరుపాడు మండలం జడలచింత గ్రామానికి చెందిన ఏదులాపురం గోపాలరావు ఎన్నికయ్యారు. సోమవారం జూలూరుపాడులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర మహా సభల్లో తనను కార్యదర్శిగా నియమించారని, ఇల్లందుకు చెందిన భూక్యా లక్ష్మణ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయినట్లు తెలిపారు. కార్మిక చట్టాల ఉల్లంఘనకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా నిర్వహించే బంద్‌లో గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొనాలని తెలిపారు. పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికై దశల వారీగా తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.

స్టాఫ్ నర్సులుగా ఎంపికైన అభ్యర్థులకు ఐడీ కార్డుల అందజేత



ఐడీ కార్డులను అందజేస్తున్న డీఎంహెచ్‌వో

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి29: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన స్టాఫ్ నర్సుల ఫలితాలు తుది జాబితాలో ఎంపికైన భద్రాద్రి జిల్లాకు చెందిన 238 మంది అభ్యర్థులకు ఐడి కార్డులను అందజేసినట్లు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శిరీష తెలిపారు. సోమవారం ఐడిఓసి లోని డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో స్టాఫ్ నర్సు పరీక్ష రాసిన అభ్యర్థుల ఒరిజినల్ హాల్‌టిక్కెట్లను పరిశీలించి 240 మంది అభ్యర్థులకు గాను 238 మందికి జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసి హైదరాబాద్‌లోని కమీషనర్ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. బుధవారం ఎల్‌బిస్టేడియంలో సీఎం చేతుల మీదుగా స్టాఫ్ నర్సులకు నియామకపత్రాలు అందిస్తారని తెలిపారు. అదే విధంగా కుష్టి వ్యాధిపై అవగాహన కల్పించేందుకు జిల్లాలో మంగళవారం నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు వైద్య శాఖ వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

» 1-19 సంవత్సరాల మధ్య వయస్సు వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి » కలెక్టర్ డాక్టర్ ప్రియాంక

కొత్తగూడెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 12న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయపు సమావేశ హాలులో జాతీయ నులిపురుగుల నివారణపై జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1-19 సంవత్సరాల వయస్సున్న వారు 3,36,136 మంది ఉన్నారని వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని తెలిపారు. వైద్య సిబ్బంద పర్యవేక్షణలో 1-2 వయసున్న వారికి సగం మాత్ర, తదుపరి వయసున్న వారికి మొత్తం మాత్ర వేయాలని అన్నారు. ప్రతీ అంగన్‌వాడీ, ప్రవేట్, గవర్నమెంట్ పాఠశాలల్లో ఈ కార్యక్రమంల నిర్వహిస్తారని, ఈ కార్యక్రమం గురించి తల్లి దండ్రులకు ముందస్తు సమాచారం అందించాలని విద్యా, మహిళా సంక్షేమ శాఖల అధికారులకి సూచించారు. ప్రతి గవర్నమెంట్ పాఠశాలలలో ఉన్న పిల్లలందరికీ, అంగన్‌వాడీ సెంటర్లలో ఉన్న పిల్లలందరికీ 100 శాతం ఆల్బెండజోల్ మాత్రలు వేసే బాధ్యతను జిల్లా ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రమే మాత్రలు వేయాలని, ఇళ్లకు ఇవ్వొద్దని తెలిపారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన జిల్లాగా భద్రాద్రి జిల్లాగా ఎం పికైన సందర్భంగా జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ జేవిఎల్ శిరీషకు బెస్ట్ పెర్ఫార్మింగ్ అవార్డును కలెక్టర్ ఆమెకు అందజేశారు.

వైద్యాధికారులకు అవార్డుల ప్రదానం

అదే విధంగా ఎన్క్వాస్ విభాగంలో రాష్ట్రంలోనే భద్రాద్రి జిల్లాలోని ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరోగ్య కేంద్రాలైన కరకగూడెం, ఎంపీ బంజర, ఎర్రగుంట, సత్యనారాయణపురం, కొమరారం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు సర్వారం, జగదీష్ కాలనీ, ఏఎస్ఆర్ కాలనీ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు శేఖరం బంజర, రామవరం, సఫాయిబస్తీ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పాల్వం చ, ఏరియా ఆస్పిటల్ భద్రాచలం వైద్యాధికారులకు కలెక్టర్ అవార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు డాక్టర్ రాంబాబు, మధుసూదన్ రాజు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుకృత, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ, ఎన్సీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధువరన్, డిప్యూటీ డెమో నాగలక్ష్మి, సీహెచ్‌ఓ నాగభూషణం, హెల్త్ ఎడ్యుకేటర్ జీబీ, ఎం క్వాస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర స్పందన, క్వాలిటీ మేనేజర్ శృ తి, డీపీయు దుర్గ, ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్



అవార్డులు అందుకుంటున్న వైద్యులు

దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ హాలులో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణిని నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూధన్ రాజు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

16న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

కొత్తగూడెం టౌన్ జనవరి 29: ఫిబ్రవరి 16న జరిగే సమ్మెలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొనాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం జేఏసీ నాయకులు యర్రగాని కృష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం సింగరేణి కాంట్రాక్టు కార్మికులు సింగరేణి పర్సనల్ డీజీఎం కేవిఎల్ వరప్రసాద్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కొత్తగూడెం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి మధు, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఎస్‌డి రాసుదుద్దిన్, వెంకన్న, ఐఎఫటీయూ అధ్యక్షులు ఎస్కే యాకూబ్,

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

సుజాతనగర్, జనవరి 29 : జేఈఈ మెయిన్స్ పరీక్షజీ ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని అబ్దుల్ కలామ్ ఇంజనీరింగ్ కళాశాలనందు సోమవారం పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రంలోకి గంటన్నర ముందే విద్యార్థులను అనుమతించారు. పరీక్షకు 131 మంది విద్యార్థులకు 131 మంది హాజరు కాగా ఎవరూ గైర్హాజరవలేదని, ఫిబ్రవరి 1 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎల్ఈడీ లైట్లు అందజేత

బూర్గంపాడు, జనవరి 29: ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్ర సారపాక ఆధ్వర్యంలో బూర్గంపాడులోని ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ విజ్ఞప్తి మేరకు సోమవారం ఎల్ఈడీ లైట్లను అందజేశారు. పాఠశాలలో పనిచేయని 8ఎల్ఈడీల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో కొత్వాల పూజలు



పూజలు నిర్వహిస్తున్న డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల

పాల్వంచ రూరల్, పాల్వంచ టౌన్ జనవరి 29: ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు జగన్నాథపురంలోని కనకదుర్గ (పెద్దమ్మగుడి) ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తనపై నమ్మకంతో డీసీఎంఎస్ ఛైర్మన్ పదవి తనకు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భట్టి విక్రమార్కలకు ఆయన కృతజ్ఞత తెలిపారు. కార్యక్రమంలో పెద్దమ్మగుడి ఆచార్యులు ఎస్‌వీఆర్‌కె ఆచార్యులు, గంధం వెంగళరావు, స్థానిక సర్పంచ్ అనిత, కిలారు నాగమల్లేశ్వరరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ పరుచూరి రవికుమార్, మాజీ జడ్పీటీసీ ఎర్రంశెట్టి ముత్తయ్య, నందా నాయక్ తదితరులు ఉన్నారు.

కొత్వాలకు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుల సన్మానం

ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్‌గా ఎంపికైన జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావును విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సోమవారం పాల్వంచ ఆయన నివాసంలో కలిసి పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కాపర్తి వెంకటాచారి, జె ప్రభాకరా చారీ, మోతుకురి రవి, తిరుపతి, రాఘవాచారీ, బండారు సత్యనారాయణ, ఎం. శ్రీనివాసరావు, రామాచారీ, మధు, వైకుంఠనాథ్, వెంకటా చారీ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీఎంకు విద్యార్థుల ఉత్తరాలు

పాల్వంచ, జనవరి 29 : సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విద్యార్థులు ఉత్తరాలు రాశారు. పాల్వంచ పట్టణ పరిధిలోని సీతరాంపట్నం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం విద్యార్థులు పోస్టుకార్డులు రాశారు. తమ పాఠశాలలో 60 మంది విద్యార్థులు ఉండగా కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని చొరవ తీసుకుని మరో టీచర్‌ను గానీ, లేదా విద్యా వలంటీర్‌ను గానీ నియమించాలని వేడుకున్నారు. ప్రభుత్వం తరపున పారిశుధ్య కార్మికుడిని నిమయమించాలని, తరగతి గదుల్లో సరిపడ బల్లలు ఏర్పాటు చేయాలని, గురుకులాల్లో మాదిరిగా నోట్‌పుస్తకాలు పంపిణీ చేయాలని పోస్టుకార్డులో ప్రస్తావించారు. అదే విదంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి చేయాలని కోరారు.

కొత్తగూడెం డయాలసిస్ సెంటర్‌కు రూ.9.90 లక్షల మంజూరు

● రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి 29: కొత్తగూడెం డయాలసిస్ సెంటర్‌కు రూ.9.90 లక్షల నిధులను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోమవారం మంజూరు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్యశాలలోని డయాలసిస్ సెంటర్‌లో సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు తన ఎంపీ నిధుల నుంచి విడుదల చేశారు. వైద్యశాలలో డయాలసిస్ చేయించుకోవడానికి వచ్చే బాధితులకు సరిపడా పడకలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం కేవలం ఐదు పడకలు మాత్రమే ఉండడంతో ఎంపీ దృష్టికి వెళ్లడంతో చర్యలు చేపట్టారు. తక్షణమే స్పందించి ఎంపీ రవిచంద్ర కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి సూపర్డెంట్ డెంట్ డాక్టర్ కుమారస్వామితో మాట్లాడి డయాలసిస్ సేవలు మెరుగు పరిచేందుకు మరికొంతమందికి తక్షణమే వైద్యం అందేందుకు అవసరమైన పనులతో కూడిన నివేధికను అందజేయాలని కోరారు. ఆసుపత్రి సూపర్డెండెంట్ అందించిన నివేధిక అనుసరించి నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు సంబంధించిన అధికారులకు మంజూరి ధ్రువపత్రాలను అందజేశారు. తమ ఆవేధనను అర్థం చేసుకొని వెంటనే నిధులు మంజూరు చేసిన ఎంపి రవిచంద్రకు కిడ్నీ రోగ బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

కోల్‌మైన్ ఆఫీసర్స్ అసోసియన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా శివప్రసాద్

ఇల్లెందుటౌన్, జనవరి 29: కోల్‌మైన్ ఆఫీసర్స్ అసోసియన్ ఆఫ్ ఇండియా ఇల్లెందు ఏరియా అధ్యక్షుడుగా ఎన్నికైన శివ ప్రసాద్‌తో పాటు ఇతర సభ్యులను సోమవారం ఏరియా జీఎం జాన్‌ఆనంద్ అభినందించారు. స్థానిక జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జీఎం జాన్‌ఆనంద్ మాట్లాడుతూ.. సింగరేణి కమిటిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చిన్నయ్య, మదుసుధన్, సెక్రటరి కే. శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరిలు పవన్‌కుమార్, నాగేశ్వరావు, సందిప్ పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులు భర్తీచేయాలి

ఇల్లెందుటౌన్, జనవరి 29: ఇల్లెందు ఏరియాలో ఖాళీగా ఉన్న టైంరేటేడ్ వెకన్సీలను తక్షణమే భర్తీ చేయాలని కొరుతు సింరేణి ఏరియా ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్‌కు వినతిపత్రం అందించారు. ఐఎన్‌టీయూసీ ఇల్లెందుడివిజన్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మండల పరిధిలోని బోజ్జయిగూడెం సమ్మక్క-సారక్క దేవాలయం వద్ద బోరు వేసేందుకు జీఎం జాన్‌ఆనంద్ అంగికరించారని. బోజ్జాయిగూడెం సర్పంచ్‌వెంకటేశ్వర్లు తెలిపారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

మణుగూరు, జనవరి 29: విదార్థులు పాఠ్యాంశాల విజ్ఞానంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందిచుకోవాలని జడ్పీ ఉన్నత కో-ఎడ్యుకేషన్ పాఠశాల హెచ్ఎం నాగశ్రీ అన్నారు. సోమవారం పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన స్పెషల్ విసార్ట్, డ్రామ పోటీలకు ముఖ్య అతిధిగా హజరై ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఆమె మాట్లాడారు. భద్రాద్రి జిల్లా ఈఎల్‌టీఏ పరిశీలకులు, ఆంగ్ల రిసోర్స్ పర్సన్ డాక్టర్ షేక్ మీరా హుస్సేన్, మండల కన్వీనర్ మీరెడ్డి ఇంద్రసేనారెడ్డి మాట్లాడారు.

హమాలీల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

అశ్వారావుపేట, జనవరి 29: హమాలీ కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయుసీ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేసారు. సోమవారం అశ్వారావుపేటలో హమాలీ అడ్డాలో హమాలీలను ఉద్దేశించి అర్జున్ మాట్లాడారు. ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏసు, రాంబాబు, రమేష్, హనుమంతరావు, మారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజుపేటను పునరావాస గ్రామంగా ప్రకటించాలి

మణుగూరుటౌన్, జనవరి 29: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట గ్రామాన్ని సింగరేణి పునరావాస గ్రామంగా ప్రకటించాలని తెలంగాణ భూ నిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు రేపాకుల శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్యలు డిమాండ్ చేశారు. సోమవారం రాజుపేట గ్రామంలో జరిగిన నిర్వాసితులు సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, కొడిశాల రాములు, సత్రపల్లి సాంబశివరావు, పిట్టల నాగమణి, బొల్లం రాజు, సీఐటీయు నాయకులు నర్సింహారావు, నిర్వాసితులు ప్రభాకర్, మున్నా, సతీష్, భూక్య కవిత, వెంకటరాములు, భాస్కర్, సౌందర్య, పూజిత పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విదానాన్ని రద్దు చేయాలి

ఇల్లెందురూరల్, జనవరి 29: కేంద్ర పభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విదానాన్ని రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు భూక్య శ్యామ్, ఇర్పా రాజేష డిమాండ్ చేశారు. సోమవారం ఇల్లెందు మండలం సుభాష్‌నగర్‌లోని ప్రభుత్వ డీగ్రి కళాశాలలో జరిగిన సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులంతా నూతన విద్యావిదానంపై పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఫిబ్రవరి3న జరిగే ప్రొటెస్ట్ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో పవన్, సమత, పూజిత, ప్రమీల, రంజీత్, నాగేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బూర్గంపాడు, జనవరి 29: బూర్గంపాడు మండల పరిదిలోని గోదావరి నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ రాజ్‌కుమార్ దాడులు నిర్వహించారు. సోమవారం చేపట్టిన దాడుల్లో నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఓ ట్రాక్టరును పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ రవాణాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించిన బీటీపీఎస్ సీఈ

మణుగూరు, జనవరి 29: భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ సీఈ బిచ్చన్న సోమవారం బీటీపీఎస్ 1104 యూనియన్ డైరీ, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షకార్యదర్శులు హేమ్లా నాయక్, సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు కంటే రాజేందర్, కేశబోయిన కోటేశ్వరరావు, లచ్చిరాం, వెంకట్‌రామ్, సాంబశివరావు, రమేష్, శ్రీనివాసరావు, ఏపూరి నాగేశ్వరరావు, వెంకన్న, సంగయ్య, మహిళా నాయకురాలు సునిత తదితరులు పాల్గొన్నారు.

ఏ సమస్య ఉన్నా ఎమ్మెల్యేకు చెప్పండి

»కాంగ్రెస్ శ్రేణులకు తుమ్మల సూచన » మంత్రిని కలిసిన ఎస్పీ రోహిత్‌రాజ్



దమ్మపేట/కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి 29 : అశ్వారావుపేట నియోజక వర్గ పరిదిలోని మండలాలలో ఏ సమస్యవున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దృష్టికి తీసుకు వెళ్ళాలని కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరావును సోమవారం గండుగులపల్లిలోని ఆయన నివాసంలో ఆయా మండలాలకు చెందిన పలువురు నాయుకులు కలిసారు. పలువురు సమస్యలను పరిష్కరించాలని తుమ్మల దృష్టికి తీసుకు వెళ్ళగా ఏ సమస్య వున్న ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్ళి పరిష్కరించుకోవాలన్నారు. పరిష్కారం కాని పెద్ద సమస్యలు వుంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. సమస్యల కోసం నేరుగా తనవద్దకు రావద్దన్నారు. అంతకు ముందుఎస్పీ రోహిత్‌రాజ్ మంత్రి తుమ్మలను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

అందరికి పౌష్టికాహారం అందించాలి

●ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్, జనవరి 29 : ప్రభుత్వం అందించే బలవర్ధకమైన పౌష్టికాహారం బాలింతలకు, శిశువులందరికి అందించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ఐసీడీఎస్ సీడీపీఓల సమీక్షా సమావేశాన్ని ప్రజాభవన్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీమేరకు మిని అంగన్‌వాడీ కేంద్రాలను అప్ గ్రేడ్ చేస్తున్నామని తెలిపి అప్‌గ్రేడ్ చేసిన ధృవ పత్రాలను ఆయా కేంద్రాల నిర్వాహకులకు అందజేశారు. అప్‌గ్రేడ్ చేయడం వలన నియోజకవర్గంలో సుమారు 164 మిని అంగన్‌వాడీ కేంద్రాలకు పైగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. సమావేశంలో ప్రస్తుతం ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని వసతి సౌకర్యాలను, అద్దె భవనాలు, సొంత భవనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వెంటిలేషన్ సౌకర్యంతోపాటు ప్రభుత్వం నుంచి ప్రతినెల అందుతున్న గుడ్లు, నూనె, పాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతోన్న అంగన్‌వాడీ కేంద్రాల నివేధికను అందజేయాలని కోరారు. మిని అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడం పట్ల ఐసీడీఎస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి విజేత, సీడీపీఓలు విజలక్ష్మీ, తారా, సీతారామ, ఏసీడీపీఓలు రేవతి, సూపర్‌వైజర్‌లు, నియోజకవర్గ మిని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

సంకటహరి చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు

మణుగూరుటౌన్, జనవరి 29 : పట్టణంలోని అశోక్‌నగర్ సాయిబాబా మందిరంలోని సోమవారం సంకటహరి చతుర్థి సందర్భంగా శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో బాగంగా స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలయ అర్చకులు పవన్‌కుమార్ శర్మ, సంతోష్, సాయిగణా శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు, ఆలయ సేవా బృందం తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించి వాహనాలను నడపాలి

చుంచుపల్లి/భద్రాచలం, జనవరి 29: రవాణాశాఖ, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. సోమవారం కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పీవీకే - 5 ప్రాంతంలో గల బొగ్గులారీ డ్రైవర్లకు రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా సలహాలు సూచనలు అందించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒత్తిడి లేని సమయంలోనే వాహనాలను నడపాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో ఆ వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధృవపత్రాలను తమ వెంట ఉంచుకొని ట్రాఫిక్, రవాణా శాఖ అధికారుల తనిఖీల్లో వారికి సహకరించాలని కోరారు. లారీలకు వెనుక వైపు రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం వన్‌టౌన్, టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, రమేష్, ఎస్ఐ జుబేదాబేగం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం: డ్రైవర్లు రోడ్డు మీద తమ వాహనాలను వ్యతిరేక దిశలో నడిపి ప్రమాదాలకు గురికావద్దని భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. భద్రాచలంలో సోమవారం జాతీయస్థాయి రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా వాహన చోదకులకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐలు వెంకన్న, శ్రీనివాస్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళకు రూ.55వేలు జరిమానా

టేకులపల్లి, జనవరి 29: ఎక్సైజ్ కేసులో బైండోవర్ ఉల్లంఘించి నాటుసారాయి అమ్మకాలు నిర్వహిస్తున్న ఓ మహిళకు ఎక్సైజ్ పోలీసులు జరిమానా విధించారు. ఇల్లెందు ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ కథనం ప్రకారం టేకులపల్లి మండలంలోని తూర్పుగూడెం గ్రామానికి చెందిన అంగోతు సునీత బైండవర్ నిబందలను ఉల్లంఘించి నాటుసారాయి తయారుచేసి అమ్మకాలు నిర్వహిస్తుండటంతో సోమవారం ఇల్లెందు ఎక్సైజ్ ఎస్ఐ రమాదేవి ఆమెపై కేసు నమోదు చేసి స్థానిక తహసీల్దార్ కృష్ణవేణి ముందు హాజరు పరచారు. ఆమె బైండవర్‌ను ఉల్లంగించడంతో అపరాధ రుసుముగా రూ55వేలు జరిమానా విధించారు. అపరాధ రుసుము రూ.55వేలు ప్రభుత్వ ఖాతాలో చలానా రూపంలో జమాచేసినట్లు సీఐ రాంప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ రమాదేవి, ఎక్సైజ్ సిబ్బంది రవిబాబు, ఎస్‌కే బాబా, ఎస్‌కే యాకూబ్‌పాష, మల్లికార్జున్, చారి, తులసి తదితరులు పాల్గొన్నారు.

నిషేదిత ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు: మునిసిపల్ కమిషనర్

పాల్వంచ టౌన్, జనవరి 29: ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్‌ను విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ స్వామి హెచ్చరించారు. సోమవారం పాల్వంచ మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్స్‌పెక్టర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో మార్కెట్‌లోని పలు దుఖానాలు, సూపర్ మార్కెట్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. నిషేదిత ప్లాస్టిక్ వినియోగిస్తున్న పలు దుఖానాల్లో పట్టుబడ్డ ప్లాస్టిక్‌ను స్వాధీన పరుచుకొని పలువురికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ ఫరీద్, జవాన్లు యాసిన్, జె రమేష్, ప్రవీణ్, ముఖేష్, రవి తదితరులు ఉన్నారు.

బీజేపీ జిల్లా కోశాధికారిగా కొండ

అశ్వారావుపేట, జనవరి 29: అశ్వారావుపేట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి ఎస్‌వీటీ కొండ బీజేపీ జిల్లా కోశాధికారిగ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయనకు జిల్లా అధ్యక్షుడు కెవి రంగాకిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే ప్రమాణ స్వీకారం ఉంటుందని, తనపై నమ్మకం ఉంచి జిల్లా కోశాధికారిగ నియమించిన పార్టీ అధిష్టానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కోశాధికారిగ కొండ నియామకంపట్ల పట్టణంలోని పలు వర్గాలు అభినంధనలు తెలిపాయి.

మహిళా రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేయాలి

మణుగూరు, జనవరి 29: అన్ని రంగాల్లో మహిళలకు మహిళా రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి లక్ష్మీకుమారి డిమాండ్ చేశారు. సోమవారం మహిళా సమాఖ్య మండల కార్యవర్గ సమావేశంలో ఆమే మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. గ్రామాల్లో మహిళా కమిటీలు ఏర్పాటు చేయాలని, సభ్యత్వాలు త్వరితగతిన పూర్తి చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బోలగాని సమ్మక్క, నాగేళ్ల నిర్మల, పాయం లక్ష్మీ, అజ్మీర బద్రి, నాగేళ్ల ప్రమీల, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి: సర్పంచ్‌ల వినతి

అశ్వాపురం జనవరి 29: గ్రామపంచాయతీలకు సంబందించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం పలువురు సర్పంచ్‌లు ఎంపీడీవో వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. 20నెలలుగా పంచాయతీలకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవటంతో బకాయిలు పేరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పంచాయతీల్లో మౌళిక సదుపాయాల కల్పనకు ఇబ్బందులు ఎదుర్కోవల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మరో రెండు రోజుల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో సర్పంచ్‌లపై బిల్లుల చెల్లింపుకు ఒత్తిడిపెరుగుతోందని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే నిధులు విడుదలయ్యేల చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అశ్వాపురం, గొందిగూడెం, అమెర్ధా, ఆనందాపురం, బట్టీలగుంపు సర్పంచ్‌లు బాణోత్ శారద, పాయంభద్రమ్మ, బండ్ల సీతమ్మ, పూసా జ్యోతి, బట్టా సత్యనారాయణలు పాల్గొన్నారు.

ఎంపీవోకు ఘన సన్మానం

పినపాక, జనవరి 29 : ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న పినపాక ఎంపీఓ కంటిపూడి వెంకటేశ్వరరావును మండల ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీపీ గుమ్మడి గాంధీ, సర్పంచులు మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచులు ఎం.నర్సింహరావు, గొగ్గలి నాగేశ్వరరావు, కొర్సా కృష్ణంరాజు, తోలెం కళ్యాణి, ఈసం భవతి, సునీల్, మేడా వెంకన్న, మహేష్, ఎంపీటీసీలు చింతపంటి సత్యం, కాయం శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, గట్ల శ్రీనివాసరెడ్డి, జర్నలిస్టులు తోట గంగాదర్, శ్రీరామ్ బృహస్పతి, సారయ్య, భరత్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలు

మణుగూరుటౌన్, జనవరి 29: మణుగూరు మండల ఫొటో అండ్ వీడియోస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కృష్ణమోహన్ ఎన్నికయ్యారు. సోమవారం అసోసియేషన్ జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునితోపాటు ప్రధాన కార్యదర్శిగా పుసులూరి శ్రీనివాస్, కోశాధికారిగా ఎంఆర్ఎస్ శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కీసర సుధాకర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి రామకృష్ణ, జిల్లా ఎన్నికల అధికారి పంపన రమేష్, సహాయ ఎన్నికల అధికారులు కరుణాకర్, సురేష్, సభ్యులు వేముల నర్సింహారావు, జీ సారయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో 'సెయింట్ విన్‌సెంట్' విద్యార్థుల ప్రతిభ

కొత్తగూడెం టౌన్, జనవరి 29: కొత్తగూడెం పట్టణంలో నిర్వహించిన రిపబ్లిక్‌డే కప్ తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో ఎదురుగడ్డ పంచాయతీ పరిధిలోని సెయింట్ విన్‌సెంట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని సత్తా చాటి బహుమతులను సాధించారు. ఉర్దూఘర్‌లో జరిగిన పోటీలలో 28 మంది విద్యార్థులు పాల్గొని పతాకాలను సాధించడంతో సర్పంచ్ బాణోత్ కవిత, పాఠశాల హెచ్ఎం సుచరిత, కోచ్ ప్రేమ్‌కుమార్‌లు వారిని అభినందించారు.

కరాటేలో కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ

అన్నపురెడ్డిపల్లి, జనవరి 29: రిపబ్లిక్ డే సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల ఓపెన్ కేటగిరిలో ఆదివారం కొత్తగూడెంలో జరిగిన కరాటే పోటీల్లో అన్నపురెడ్డిపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినిలు అత్యంత ప్రతిభ కనబరిసి బంగారు పతకాలు పొందారు. విద్యాలయంలో కరాటే శిక్షకులు పవన్ రెడ్డి వద్ద శిక్షణ పొందిన 30 మంది బాలికలు పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో 23 మంది బంగారు పతకాలు సాధించగా ముగ్గురు రజిత, నలుగురు కాంస్య పతకాలు దక్కించుకున్నారు. వీరికి ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు.

కాంగ్రెస్ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నరసింహారావు

జూలూరుపాడు, జనవరి 29: మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన అరిగెల నరసింహారావు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. సోమవారం ఆయనకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లాడి నరసింహారావు కాకర్ల గ్రామంలో నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్, ఎంపిటిసి దుద్దుకూరి మధుసుధన్‌రావు, సోషల్ మీడియా కో-ఆర్డీనేటర్ నవీన్‌రాథోడ్, కాంగ్రెస్ నాయకులు దుద్దుకూరి నరసింహారావు, నర్వనేని పుల్లారావు, వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు, సాయిల కృష్ణయ్య, ఎం.కిరణ్ కుమార్, సమీర్, కుమార్‌బాబు, మాచిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి కుష్టువ్యాధిపై అవగాహన సదస్సులు

మణుగూరుటౌన్, జనవరి 29: గాంధీ వర్ధంతిని సందర్భంగా జనవరి 30వ తేదినుంచి ఫ్రిబ్రవరి 14 వరకు కుష్టువ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శివకుమార్ అన్నారు. సోమవారం మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లెప్రసీ(కుష్టు) వ్యాదిపై నిర్వహించిన ఎస్ఎల్ఏసీపై ఐసీడీఎస్ సిబ్బందితో కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. డాక్టర్ శివకుమార్ సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రామా, ఆంగ్ల పదాల పోటీలు

జూలూరుపాడు, జనవరి 29: జూలూరుపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల ఆంగ్లభాష ఉపాధ్యాయ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్ల స్పెల్లింగ్ పదాల, డ్రామాల పోటీలను నిర్వహించారు. విజేతకు వచ్చే నెల 3న కొత్తగూడెంలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎల్‌టిఏ మండల కన్వీనర్ టి.సాల్మన్‌రాజు, కో-కన్వీనర్ ఎస్.గురుమూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది వెంకటేశ్వరరావు, రవి కుమార్ సుమలత పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు స్టేట్ బృందం తనిఖీలు: సీడీపీవో

జూలూరుపాడు, జనవరి 29: అంగన్‌వాడీ కేంద్రాలను మంగళ, బుధవారం స్టేట్ బృంధాలు తనిఖీలు నిర్వహించనున్నాయని అంగన్‌వాడీ టీచర్లు అప్రమత్తంగా ఉండాలని చంద్రుగొండ ప్రాజెక్ట్ సిడిపివో సీహెచ్.నిర్మలజ్యోతి తెలిపారు. సోమవారం మండలంలోని సాయిరాంతండా అంగన్‌వాడీ కేంద్రంలో జూలూరుపాడు సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. రికార్డులు, రిజిస్ట్రర్‌లను పరిశీలించారు. సమావేశంలో సూపర్ వైజర్లు నాగమణి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి వృక్ష మిత్రులకు క్రీడా పోటీలు

అశ్వారావుపేట, జనవరి 29: కొబ్బరి వృక్ష మిత్రలకు సోమవారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో వృక్ష మిత్రలకు వివిద రకాల క్రీడా పోటీ లు నిర్వహించి విజేతలకు బహుమతు లు అందజేశారు. 20 మంది మిత్రలకు కొబ్బరి చెట్లు ఎక్కే యంత్రాలను పంపి ణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ ఇన్‌చార్జి డీన్ ఐవీ శ్రీనివాసరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి జయమ్మ, డా. నాగాంజలి, డా. రమేష్, పావని, శిరీష, డా సీలిమ, కొబ్బరి అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందు మూలంగా సమస్త జనులకు తెలియచేయునది ఏమనగా నా క్లయింట్ శ్రీ పెదబలిమి లింక్ తండ్రి : మల్లికార్జునరావు, వయస్సు : 44, వృత్తి : వ్యాపారం, నివాసం : భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అను నా క్లయింట్‌కు కృష్ణా జిల్లా, విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ : 46/3లు సందుగల 25.5 చదరపు గజాల ఖాళీ స్థలంకు సంబంధించిన క్రయ దస్తావేజుల ఒరిజినల్ రిజిస్టర్డు జ్యుడిషియల్ బాండ్ (రిజిస్ట్రేషన్ నంబర్ : 1631/2018 తేది: 21-02-2018) పత్రాలు తేది : 04-01-2024న అశ్వాపురం వచ్చి తిరిగి భద్రాచలం వెళ్లే క్రమంలో పోగొట్టుకుని పలన సదరు పత్రాలు కనిపించడం లేదు. ఈ విషయమై అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసియున్నారు. కావున సదరు భూమి క్రయ దస్తావేజులు(రిజిస్ట్రేషన్ నంబర్ : 1631/2018 తేది : 21-02-2018) ఎవరికైన దొరికినచో నాకు గాని లేదా నా క్లయింట్‌కు గాని తెచ్చి ఇవ్వగలరు లేదా సమాచారం తెలుపగలరు. సదరు వ్యక్తికి నా క్లయింట్ తగు పారితోషకం ఇవ్వగలరని తెలియచేస్తున్నారు

కుర్మ విజయరావు,
న్యాయవాది
మణుగూరు,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫోన్
నెం: 9440354210